మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :17 | మంగళవారం ,17 డిసెంబర్ 2024 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 | వెల: 3 రూ/-


## నేటిమాట

" ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించాలి అంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి ! , ,
-అబ్రహం లింకన్



## టీడీపీ ర్యాలీలో వైసీపీ మాజీ మంత్రి..

- ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం
- టీడీపీ ర్యాలీలో వైసీపీ మాజీ మంత్రి
- మంత్రితో కలిసి పాల్గొనడంపై చర్చ



4లో

## బీఏసీ అంటే బిస్కట్ చాయ్ సమావేశం కాదు

### బీఆర్ఎస్ పార్టీ బహిష్కరణ

హైదరాబాద్,16 డిసెంబర్ క్రాంతి న్యూస్

అసెంబ్లీ సమావేశాల నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ధోరణిపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఏసీ అంటే చాయ్ బిస్కెట్ సమావేశం కాదని చెబుతూ సమావేశాన్ని వాకౌట్ చేసింది.



2లో




## సినిమా షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం.

8లో

# ఇట్లైతే ముఖ్యమంత్రి పదవి అవుట్ !

హైదరాబాద్, క్రాంతి న్యూస్

తెలంగాణ రాజకీయాలు అనేక మలుపులు తిరగవట్టే. సర్కారు పాలనపై, ఇచ్చిన హామీలు, వాటి అమలు జాప్యంపై ప్రజలు తీవ్ర గుస్సా జేస్తున్నారు. పొయ్యి మీద నుండి పెనంపై పడ్డట్టు ఉంది ప్రస్తుత పరిస్థితి. కేసీఆర్ హయాంలోనే మంచిగా ఉండే ఈ కాంగ్రెస్ ని నమ్మి నట్టేట మునిగాము అని ప్రతి ఒక్కరూ అనుకుంటుండ్రు. మళ్ళీ కేసీఆర్ సారె రావాలి అని మాట్లాడుకుంటుండ్రు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు కాక రేవంత్ సర్కారుపై ప్రజా విశ్వాసం సన్నగిల్లుతుంది. పట్టుమని ఏడాది కాకముందే రేవంత్ సర్కారు వ్యతిరేకత మూటగట్టుకుంది. నిన్న గాక మొన్ననే విజయోత్సవాల పేరిట సంబరాలు జరుపుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. కానీ పబ్లిక్ మాత్రం మస్తు గుస్సా మీద ఉంద్రు. అసలు ఈ ఏడాదిలో ఏంచేశావాని పెద్ద సంబరాలు జరుపుకుద్రు అంటూ రేవంత్ పై గుస్సా జేస్తున్నద్రు.



## ఒట్టి మాటలు.. ఉత్తిచేతలు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన 6 గ్యారంటీలు పబ్లిక్ లో ఉత్సాహం కలిగించాయి. ప్రభుత్వం ఏర్పడగానే 100 రోజుల్లో 6 గ్యారంటీలు హామీలు అమలు పరుస్తామని చెప్పింది. కానీ 100 రోజులు కాదు కదా 300 రోజులైనా ఇంకా అమలు పరుస్తలేదు. హామీల్లో ప్రధానమైన రైతులకు రుణ మాఫీ, రైతు బంధు, నిరుద్యోగులకు జాబ్ కాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం లాంటివి ఇంకా అమలులో పరుచకపోవడంతో పబ్లిక్ లో రేవంత్ సర్కారు పై విశ్వాసం సన్నగిల్లుతుంది . ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రభుత్వం పట్ల కోపంతో ఉన్నారు. ఈ నిర్లక్ష్య వైఖరి రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద సమస్యగా మారవచ్చు.

## విద్యార్థుల నిరసనలురోడ్లమీద ఆందోళనలు

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ఎంతో కీలక పాత్ర పోషించింద్రు. కానీ ఇప్పుడు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గురుకులాలో, రెసిడెన్షియల్, హాస్టల్ లలో విద్యార్థులకు మంచి అన్నం పెట్టడం లేదు. రోజు ఏదో ఒక హాస్టల్ విద్యార్థులు ఫుడ్ పాయిసన్ వాళ్ళ ఆసుపత్రుల పాలవుతుంద్రు. మంచి అన్నం పెట్టమని రోడ్లపైకి వచ్చిన విద్యార్థులను ఈ సర్కారు పోలీసులతో అణిచివేస్తుంది. ఇలాంటి సంఘటలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. విద్యావ్యవస్థలో సంక్షోభం, ఫీజుల పెరుగుదల, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలు విద్యార్థులలో కోపాన్ని పెంచుతున్నాయి. ఫీజుల నియంత్రణ కోసం సరైన చట్టాలు లేకపోవడం, విద్యాసంస్థల వాణిజ్యపరమైన ప్రవర్తన విద్యార్థులకు మేలు కాకుండా నష్టాన్ని కలిగిస్తోంది.

2లో

## 103 ఎకరాల్లో ఏపీ అసెంబ్లీ..



4లో

## మంత్రి భట్టిపై బీఆర్ఎస్ సభా హక్కుల నోటీసు



**హైదరాబాద్, క్రాంతి న్యూస్ : ఆర్‌బీఐ నివేదిక ప్రకారం రూ. 3.89 లక్షల కోట్లు అని స్పష్టత ఇచ్చిందని.. గతంలో సీఎంపై తాము ఉల్లంఘనా నోటీసు ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. గతంలో నాదెండ్ల మనోహర్ ఉల్లంఘన నోటీసు అడ్మిట్ చేశారన్నారు.ఈ ప్రభుత్వం ఆర్థిక విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, ప్రజలకు స్పష్టత ఇవ్వాలని తాము కోరుతున్నామని కేటీఆర్ వ్యాఖ్యానించారు.**

2లో

శాసనసభను తప్పుదోవ పట్టిస్తున్నారని తాము సభ హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామావు తెలిపారు. సోమవారం ఆయన అసెంబ్లీ లాబీ వద్ద మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. గతంలో సీఎం కిరణ్ కుమార్ రెడ్డిపై ఉల్లంఘన నోటీసు ఇస్తే చర్చకు వచ్చిందన్నారు. ప్రోటోకాల్ సమస్యలను స్పీకర్‌కు వివరించామని, లగచర్లపై చర్చకు తాము సభాపతిని అడిగామని.. బీఏసీలో కూడా ఈ అంశాన్ని లెవనెత్తుతామని చెప్పారు.

ఆర్‌బీఐ నివేదిక ప్రకారం రూ. 3.89 లక్షల కోట్లు అని స్పష్టత ఇచ్చిందని.. గతంలో సీఎంపై తాము ఉల్లంఘనా నోటీసు ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. గతంలో నాదెండ్ల మనోహర్ ఉల్లంఘన నోటీసు అడ్మిట్ చేశారన్నారు. ఈ ప్రభుత్వం ఆర్థిక విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, ప్రజలకు స్పష్టత ఇవ్వాలని తాము కోరుతున్నామని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# రియల్ ఎస్టేట్ రంగం పడిపోలేదు

### మంత్రి పొంగులేటి

- కేసీఆర్ తో మాట్లాడాలని ఉంది
- ఏపీకి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు
- వరదలతో ఇన్వెస్టర్ కి భయం
- అప్పులపై కేటీఆర్, బీఆర్ఎస్ నిజాలు తెలుసుకోవాలి
- సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇవ్వడం వారి హక్కు

గత కొంత కాలంగా తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందన్న ప్రచారంలో వాస్తవం లేదని.. కావాలనే కొంత మంది ఈ తీరుగా ప్రచారం చేస్తున్నారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. హైదరాబాద్ సహా ఇతర నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం చాలా బాగుందని, ఎలాంటి డోకా లేదని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన మంత్రి పొంగులేటి.. రియల్ ఎస్టేట్ రంగం, రాష్ట్ర అప్పులు సహా ప్రభుత్వంపై వ్యతిరేకత వంటి వివిధ అంశాలపై మాట్లాడారు. అనేక ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు.



2లో

## లగచర్ల రైతులకు న్యాయం జరిగే దాకా పోరాడతాం..

### : కేటీఆర్

తెలంగాణ అసెంబ్లీలో అరాచక, దుర్మార్గమైన ప్రభుత్వం తీరును ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. భూములు ఇవ్వని పాపానికి దళిత, బలహీనవర్గాల రైతులను జైల్లో పెట్టారని మండిపడ్డారు. భూములు ఇవ్వమన్న రైతులపై కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



2లో

### దేవుళ్లపై ఒట్లు వేస్తేనే దిక్కు లేదు.. సంక్రాంతికి పథకాలిస్తామంటే ఎలా నమ్ముతారు

శాసనసభలో పరిమితుల విధింపుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నేండ్లలో ఎప్పుడూ లేనివిధంగా మాజీ ఎమ్మెల్యేలను శాసనసభవైపునకు రాకుండా చేసిన తీరుపై మండిపడ్డారు.

## వామ్మో ప్లేటు భోజనం ₹ 32 వేలు?


**వందమందికి ఖర్చు రూ.32 లక్షలు ! రాజన్న ఆలయమే చెల్లించాలని ఉన్నతాధికారి ఒత్తిడి**

- సీఎం రేవంత్‌రెడ్డి సహా వందమందికి ఖర్చు రూ.32 లక్షలు
- వేములవాడ రాజన్న గుడికి బిల్లులు పంపిన తాజ్‌కృష్ణ
- ఆలయ చైర్మన్ చాంబర్‌నే హొటల్‌గా మార్చేసిన సిబ్బంది
- ఒక్కో పట్టు పంచెకు పదివేలు ఖర్చు పెట్టిన అధికారులు
- తాగే గ్లాస్ నుంచి టేబుల్ వరకు విందుకోసం కొనుగోలు
- రాజన్న దర్శనంతో కలిపి మొత్తం ఖర్చు కోటీ 70 లక్షలు!
- బిల్లు మొత్తం ఆలయమే చెల్లించాలని ఉన్నతాధికారి ఒత్తిడి
- సిరిసిల్ల కలెక్టర్ వద్దకు చేరిన ఫైలు.. తెరపైకి పంచాయితీ



5లో

## సీమ బ్యాక్‌డ్రాప్ లవ్‌స్టోరీతో అఖిల్ కొత్త సినిమా..



8లో




## కిరాటగా మోహన్ లాల్.. 'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

# ఇట్లైతే ముఖ్యమంత్రి పదవి అవుట్!

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, క్రాంతి న్యూస్ :

## నిరుద్యోగ యువతకు నిరాశ

నిరుద్యోగ సమస్య తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పెరిగిపోతోంది. ముఖ్యంగా, సర్కారు కొలువులపైనే ఆధారపడే యువతకు ఉద్యోగాలు అందకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఒక వైపు ప్రైవేటు రంగంలో అవకాశాలు తగ్గిపోతుండగా, ప్రభుత్వ రంగంలో నియామకాలపై స్పష్టత లేకపోవడం వల్ల నిరుద్యోగ యువతలో ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేసీఆర్ ప్రభుత్వం పడిపోవడానికి ముఖ్య కారణం నిరుద్యోగులే. గత ప్రభుత్వంలో ఎక్సామ్ పేపర్ లీకేజిల వాళ్ళ నిరుద్యోగులు ఎంతో ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం ఏర్పడగానే జాబ్ కాలెండర్ ప్రకటిస్తామని, ఏడాదికి 2 లక్షల కొలువులు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. దాంతో నిరుద్యోగులు కాంగ్రెస్ సర్కారును అధికారంలోకి తీసుకొచ్చిండ్రు . కానీ 300 రోజులైనా రేవంత్ సర్కారు కేవలం 16 వేల కొలువులే ఇచ్చింది. కేసీఆర్ ఇచ్చిన 36 వేల కొలువులను తామే ఇచ్చామని పదే పదే గప్పాలు జెప్పుకుంటుంది. గ్రూప్ 1 నిరుద్యోగులు జీవో 29 వల్ల తమకు అన్యాయం జరుగుతుంది అని నిరసనలు జేస్తే వారిని పోలీసులతో కొట్టించి కేసులు పెట్టించింది. నిరుద్యోగ భృతిపై స్పష్టత లేకపోవడం వల్ల సర్కారు మాటలు ఒట్టి మూటలే అని యువత అనుకుంటుండ్రు. పోటీ పరీక్షల నిర్వహణలో జాప్యాలు, మళ్ళీ ఆంధ్రా వాళ్ళకు కొలువు కట్టబెత్తె ప్రయత్నాలు యువతలో మరింత గుస్సా తెప్పిస్తుంది.

## రైతుల కష్టాలుసంక్షేమం పట్ల నిర్లక్ష్యం

మాది ప్రజాపాలన అని రైతులకు ఆగస్టు 15లోపు 2 లక్షల వరకు ఋణమాఫీ చేస్తానని కనిపించిన దేవుళ్ళపై ఒట్టేసి చెప్పిండు రేవంత్. కానీ అరకొరగా ఋణమాఫీ చేసి మొత్తం చేశాము అని గప్పాలు కొడుతుండు. ఋణమాఫీ విషయంలో ముఖ్యమంత్రిది, మంత్రులది తలో దారి. ఒకరేమో మొత్తం చేశాం అంటారు. వ్యవసాయ మంత్రిమె ఇంకా చేయాల్సి ఉంది అతి త్వరలో పూర్తి చేస్తాం అంటాడు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం, పంటల ధరలు పడిపోవడం, రుణమాఫీ ప్రక్రియలో జాప్యం వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. వ్యవసాయ రంగంలో సాంకేతికతను పెంచే ప్రయత్నాలు లేకపోవడంతో, పండించిన పంటకు సరైన మార్కెట్ దొరక్క రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వం నిర్వహణలో ఉన్న లోపాలను వెలుగులోకి తీసుకువస్తోంది. రుణమాఫీ కార్యక్రమాలు తగిన వేగంతో అమలు కావడం లేదన్న ఆరోపణలు, రైతుల సమస్యలను మరింత దిగజార్చాయి. అలాగే, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల రైతులకు సాగు కష్టసాధ్యమవుతోంది. కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరాని ఎండబెట్టి, రైతుల పొట్ట కొట్టింది ఈ సర్కారు.

## సినీ పరిశ్రమపై కక్ష.. మీడియాపై అక్రమ కేసులు

టాలీవుడ్ ని టార్గెట్ చేసినట్టు కనిపిస్తుంది. హైడ్రా పేరుతో నాగార్జునకి సంభందించిన ఎన్ కన్వెన్షన్ ని కులగొట్టిండు. నిన్న కాక మొన్న అల్లు అర్జున్ ని అరెస్ట్ చేసిండు. హై కోర్టు బెయిల్ ఇచ్చిన ఒక రాత్రి జైల్ లో నే ఉంచిండు. దాంతో టాలీవుడ్' నుండి వచ్చిన విమర్శలు ప్రస్తుత పాలక పక్షంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సినీ పెద్దలు ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడం, ప్రజలతో పాటు మేధావులలో కూడా ప్రభుత్వంపై విశ్వాసం తగ్గుతున్న సంకేతాలను ఇస్తోంది. అంతేకాకుండా, మీడియాపై పెట్టబడుతున్న కేసులు, ప్రశ్నించే పత్రికలపై దాడులు జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆర్టిస్టులకు తగిన ఆదరణ లేకపోవడం, సినిమా రంగానికి అనుకూలమైన విధానాలు లేకపోవడం టాలీవుడ్' లో తీవ్ర విమర్శలకు దారి తీసింది.

## తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకపాయే

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారుల బాధలు కూడా రాజకీయ చర్చలలో ప్రధాన అంశంగా నిలుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ సాధనలో తమ ప్రాణాలను అర్పించిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు లేకపాయే. ఏదో కొద్ది మందికి అది కూడా తమకు అనుకూలంగా ఉన్న వారిని మాత్రమే గుర్తింపు ఇచ్చిండ్రు. ఉద్యమకారులకు అవసరమైన గుర్తింపు ఇవ్వకపోవడం ప్రభుత్వం పట్ల ప్రజా కోపాన్ని మరింతగా పెంచుతోంది. ఉద్యమకారులకు ఉద్యోగాలు ఇవ్వడం, సౌకర్యాలు కల్పించడం వంటి హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతోంది.

## మంత్రివర్గంలో నిస్సారత

ప్రస్తుత మంత్రివర్గం ఆచరణాత్మక నిర్ణయాలను తీసుకోడంలో విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రితో సహాయ మిగిలిన మంత్రులు ప్రజలతో నేరుగా మమేకం కావడంలో విఫలమవుతున్నారు. ఇది మంత్రివర్గం దక్షతపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది. రాజకీయ విమర్శకుల మాటల ప్రకారం, ఇది రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్' కు చీకటిరోజులు తెచ్చే ప్రమాదం ఉంది. ప్రజల అభిప్రాయాలు, సమస్యలపై దృష్టి పెట్టకపోవడం మంత్రివర్గానికి పెద్ద మైనస్‌గా మారుతోంది. కేవలం ప్రతికారెచ్చతో పాలన సాగిస్తున్నారు అన్న చర్చ జరుగుతుంది. తనని జైల్ కి పంపించారు, నేను కూడా వారికి జైల్ కి పంపిస్తా అని భీష్మించుకూర్చున్నారు. ఇది ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత తెస్తుంది.

## ప్రభుత్వానికి గడియారం మోగుతున్నదా?

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గమనిస్తే, ప్రభుత్వానికి ప్రజల విశ్వాసాన్ని తిరిగి గెలుచుకోవడం చాలా కష్టసాధ్యమవుతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, ఉద్యమకారులుఈ నాలుగు వర్గాలు ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తిగా ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది. ప్రభుత్వం తక్షణమే తన విధానాలను సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది. పంటల బీమా, నిరుద్యోగ భృతి, విద్యావ్యవస్థ అభివృద్ధి వంటి హామీలను కార్యరూపంలో పెట్టకపోతే, రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం అత్యంత కష్టమైన పనిగా మారవచ్చు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పనితీరులో మార్పులు చేయకపోతే, పాలనను సమర్థవంతంగా కొనసాగించడం అసాధ్యమవుతుంది.జర్రలేస్తే కుర్చీ గుంజుకోనికి పక్కనున్న మంత్రులు చూడబట్టే. ఎపుడెప్పుడా మనం కూడా సిఎం అవుదాం అని కాసుక కూర్చుండ్రు. అందుకే రేవంత్ రెడ్డి ఎన్ని తప్పులు చేస్తున్నా నివారించడం లేదు సారి కదా హై కమాండ్ తో ఫిర్యాదులు చేస్తుండ్రు. అందుకే హై కమాండ్ కూడా రేవంత్ రెడ్డికి గత 5 నెలలుగా అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు అన్న చర్చ సాగుతుంది. ఏడాదిగా మంత్రి వర్గ విస్తారణకి అనుమతి కూడా ఇవ్వడం లేదు. రేపో మాపో సిఎం ని దించేస్తున్నాం కదా మళ్ళీ ఎందుకు మంత్రి వర్గ విస్తరణ అని అనుకుంటునట్టుంది హై కమాండ్.

## ఇగ ఇట్లా అయితే ముఖ్యమంత్రి పదవి పోయినట్టే

సమస్యలు గిట్లనే కొనసాగితే, సిఎం పదవి గట్టిగా నిలబెట్టుకోవడం అసాధ్యమే! సర్కారు ఎన్ని హామీలు ఇచ్చినా, అవి కేవలం మాటలకే పరిమితమైతే ప్రజలు తట్టుకోలేరు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతిపక్షానికి మద్దతు పెరగడానికి దోహదం చేయవచ్చు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి, వాటిని తక్షణమే అమలు చేస్తేనే ప్రభుత్వం తన స్థాయిని నిలుపుకునే అవకాశం ఉంది. ప్రజలు కోరుకునే పారదర్శకత, సమర్థత, పటిష్టమైన పాలనను చూపడమే విజయానికి దారి చూపిస్తుంది.

# మంత్రి భట్టిపై బీఆర్ఎస్ సభా హక్కుల నోటీసు

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్, క్రాంతి న్యూస్ :

కాగా కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కామెంట్స్ చేశారు. "ప్చ్.. కష్టం రేవంత్ రెడ్డి.. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం నీ తరం కాదు..ఆయన నిర్మించిన ఇళ్ళకు సున్నాలు వేసి.. ఇందిరమ్మ ఇళ్లని ప్రజల కళ్లకు గంతలు కట్టలేవు.. గోసపడ్డ ప్రతి గుండెకు తెలుసు.. ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ఆయన పడ్డ తపన ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు...కేసీఆర్ కల.. ఎన్నాళ్లున్నా ఆ నిర్మాణాలకు మీరు కేవలం పెయింటర్లు మాత్రమే. ఎప్పటికీ మీరంతా సున్నాల వేసే సన్నాసి బ్యాచ్ మాత్రమే.." అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

## నువ్వు జైలు జీవితం అనుభవించావని అందర్నీ జైలుకు పంపుతావా..

కాగా 'బ్యాగు నిండా నోట్ల కట్టలతో పట్టుబడి జైలు జీవితం అనుభవించిన నీలాగే.. అందర్నీ జైలుకు పంపాలని అనుకుంటున్నావా రేవంత్ రెడ్డీ' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తమ సంస్థ కార్యకలాపాల గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకం ప్రభావాన్ని చెప్పినందుకు ఎల్ అండ్ టీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను జైలుకు పంపిస్తాననడం సీఎం స్థాయి వ్యక్తికి తగదని విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల అధిపతులను జైలుకు పంపుతానని రేవంత్ రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది సరైంది కాదని కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చేసిన వ్యాఖ్యలు దిగజారుతున్న ఆయన మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు. 'ఇలాంటి నిర్లక్ష్య వ్యాఖ్యలతో పరిశ్రమలకు ఏ సందేశం పంపుతున్నారు? ఇదేనా రాహుల్ గాంధీ దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి తమ పార్టీ ముఖ్యమంత్రులకు నేర్పించిన గొప్ప వ్యూహం?' అని నిలదీశారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో పురోగమించిన తెలంగాణ... అనుభవరాహిత్యం, అసమర్థత, అవినీతి కలగలసిన రేవంత్ రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని, ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాకుండా.. ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయన్నారు. కానీ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందన్నారు. పొరుగున ఉన్న అయిదు రాష్ట్రాల్లో ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 శాతం నుంచి 32 శాతం వృద్ధి నమోదైతే... తెలంగాణలో గత ఏడాది కంటే తక్కువగా ఉండడం విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పాలన గాలికొదిలేసి కక్ష సాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలాకాక మరెలా ఉంటాయని కేటీఆర్ విమర్శించారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడు ప్రశ్నించాల్సింది మాజీ సీఎం కేసీఆర్‌ను కాదని, సీఎం రేవంత్‌రెడ్డి తప్పిదాలపై నిలదీయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ రేవంత్ రెడ్డికి రాసిన లేఖను కేసీఆర్‌కు పంపారనే అనుమానం కలుగుతోందన్నారు.

# లగచర్ల రైతులకు న్యాయం జరిగే దాకా పోరాడతాం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

లగచర్ల రైతులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై శాసన సభలో చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో అసెంబ్లీని రేపటికి వాయిదా వేశారు. దీంతో శాసనసభ లోపలికి వెళ్లే దారిలో కూర్చుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. గిరిజన రైతులకు సంకెళ్లా.. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల అంశంపై చర్చించరట కానీ.. పర్యాటకంపై చర్చిస్తామంటున్నారని మండిపడ్డారు.

లగచర్ల రైతులు ముగ్గురు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఓ రైతుకు గుండెపోటు వస్తే బేడీలతో ట్రీట్‌మెంట్ చేయించారని పేర్కొన్నారు. కొడంగల్ నీ జాగీరా.. రైతుల భూములు గుంజుకుంటారా అని మండిపడ్డారు. ఎన్ని కుయుక్తులు చేసినా రైతుల తరఫున పోరాడతామని స్పష్టం చేశారు. ఆదానీతో రేవంత్ దోస్తీని నిలదీయాలని టీషర్టులతో వస్తే లోనికి వెళ్లనీయలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతుల అంశంపై చర్చించాలని పట్టుబట్టినా చర్చ పెట్టలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు. న్యాయం జరిగేదాకా పోరాడుతామని.. లగచర్ల రైతులు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. ఫార్మాసిటీకి 14 వేల ఎకరాలను సేకరించి పెడితే కాంగ్రెస్ ప్రభుత్వమే వద్దన్నదని తెలిపారు. రైతులకు రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి రూపాయి తెచ్చింది లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రశ్నించినా, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినా జైలుకు పంపిస్తామని రేవంత్ రెడ్డి బెదిరింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది అరాచక ప్రభుత్వమా? ప్రజాస్వామ్య ప్రభుత్వమా అని కేటీఆర్ నిలదీశారు. రాజ్యాంగేతర శక్తిగా రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

### దేవుళ్లపై ఒట్లు వేస్తేనే దిక్కు లేదు..

### సంక్రాంతికి పథకాలిస్తామంటే ఎలా నమ్ముతారు

శాసనసభలో పరిమితుల విధింపుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నేండ్లలో ఎప్పుడూ లేనివిధంగా మాజీ ఎమ్మెల్యేలను శాసనసభవైపునకు రాకుండా చేసిన తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యేలు వచ్చి మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసే అవకాశం ఉండేదని ఆయన గుర్తుచేశారు. కానీ ఈ ప్రభుత్వం అసెంబ్లీలోకి ప్లకార్డులను సైతం తీసుకురాకుండా అడ్డుకుంటుందని మండిపడ్డారు. గతంలో ఇదే శాసన సభలోకి ఉరితాళ్లను, ఎండిన పంటలను, నూనె దీపాలు వంటి వాటితో పాటు అనేక రకాల అంశాలను తీసుకొచ్చి నిరసన తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు.

శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కట్టడి చేసి తమ వైఫల్యాలను దాచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ అన్నారు. మీడియా వద్ద కూడా శాసన సభ్యులను మాట్లాడనీయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడటానికి వెళ్తే కాసేపు ఆపారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 2లక్షల మంది విద్యార్థులు బయటకొచ్చిన అంశంపై మాట్లాడకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. తమ వైఫల్యాలను దాచిపెట్టేందుకే ప్రభుత్వం ఇవన్ని ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు.

సభలో తాము ప్రశ్నిస్తేనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బయటకొచ్చి ప్రకటనలు చేశారని కేటీఆర్ అన్నారు. రైతు కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తామంటూ భట్టి చేసిన ప్రకటన అసెంబ్లీ వ్యవహారాలకు వ్యతిరేకమని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నప్పుడు విధానపరమైన నిర్ణయాలను సభలోనే ప్రకటించాలన్న అంశాన్ని భట్టి విక్రమార్క మరిచిపోయారని విమర్శించారు. ఈ అంశాన్ని కూడా స్పీకర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. గతంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క.. శాసన సభ బయట ప్రకటన చేయడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ఈ ప్రకటన చేస్తే తాము అడిగే ప్రశ్నలకు సమాధానం ఉండదని.. అందుకే ఇలా బయట ప్రకటన చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే సంక్రాంతి నుంచి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తామని చెబుతుందని అన్నారు. దేవుళ్లపై ఒట్లు వేసిన విషయానికే దిక్కులేదని.. అలాంటప్పుడు సంక్రాంతికి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభిస్తామంటే రాష్ట్ర ప్రజలు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు.



# రియల్ ఎస్టేట్ రంగం పడిపోలేదు

## - మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ లోని చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతల్ని సమర్థించిన పొంగులేటి.. వాటి వల్ల పెట్టుబడి దారుల్లో ఎలాంటి భయాందోళనలు లేవని స్పష్టం చేశారు. కొన్ని రోజులుగా.. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైయ్యిందని, ప్రభుత్వ విధానాలతో ఇన్వెస్టర్లల్లో భయం నెలకొందన్న ప్రచారంలో వాస్తవం లేదన్న మంత్రి.. అవన్నీ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకేనని అన్నారు.

అక్కడి నుంచి రియల్ ఎస్టేట్ మొత్తం ఆంధ్రా తరలిపోతుందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారని, కానీ.. ఇటీవల వరదల్ని మర్చిపోవద్దని గుర్తుచేశారు. కొన్ని రోజుల క్రితం విజయవాడ బుడమేరుకు వచ్చిన వరదలతో విపరీతమైన నష్టం వాటిల్లింది. అక్కడి అనేక ప్రాంతాలు పూర్తిగా రోజుల తరబడి నీటిలో మునిగిపోగా.. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నానా ఇబ్బందులు పడింది. ఆ విషయాన్ని గుర్తు చేసిన మంత్రి పొంగులేటి.. అలాంటి పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు కచ్చితంగా ఆలోచిస్తారని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఐతే హైదరాబాద్ లేదా బెంగళూరు వైపు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. చంద్రబాబు రాగానే అంత అటు వైపు వెళతారనే వాదన సరైంది కాదని వ్యాఖ్యానించారు. అమరావతిలో వరద వల్ల ఇన్వెస్ట్మెంట్ పెట్టే వాళ్లకు బయం పట్టుకుందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైడ్రా భయం ప్రజల్లో లేదన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. హైడ్రా గురించి మొదట్లో తప్పుడు ప్రచారం జరిగినా ఇప్పుడు అందరికీ నిజం తెలిసింది అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, ఖర్చుల విషయంలో బీఆర్ఎస్ పార్టీ అబద్దాలు చెబుతోందని మండిపడ్డారు. అసలు వారి హయంలో చేసిన అప్పులుపై నిజాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అప్పులంటే.. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పేరుతో చేసినవి మాత్రమే కాదని, కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పుల్ని ప్రభుత్వమే తీర్చాలని తెలిపారు. అవన్నీ కలిసి ప్రభుత్వం చేసిన అప్పు ఎంతో బీఆర్ఎస్ నేతలే చెప్పాలని డిమాండ్ చేసారు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ఇష్టారాజ్యంగా అప్పులు తెచ్చిన కేసీఆర్.. రాష్ట్ర ప్రజల నెత్తిపై రూ. 7 లక్షల 20వేల కోట్ల అప్పులు మోపారని దుయ్యబట్టారు. పైగా.. ఇప్పుడు అన్ని అప్పులు లేవని చెప్పడం వారి అమాయకత్వానికి నిదర్శనమని అన్నారు.

ప్రస్తుత శాసనసభ సమావేశాలపై స్పందించిన మంత్రి పొంగులేటి.. సభలో ఎవరి పాత్ర వారిదేనని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇవ్వడం వారి హక్కు అని వ్యాఖ్యానించిన మంత్రి పొంగులేటి.. వారికున్న హక్కుల్ని వాడుకోవచ్చని, వాటిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. ఇక కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడాన్ని ప్రశ్నించిన మంత్రి పొంగులేటి.. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే వ్యక్తిగతంగా కూర్చుని మాట్లాడాలనే కోరిక ఉందని అన్నారు.

కాంగ్రెస్ ఏడాది పాలనపై స్పందించిన మంత్రి పొంగులేటి.. ప్రభుత్వంపై ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. గతంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఇలానే ప్రచారం జరిగిందని కానీ.. రెండోసారి వైఎస్ఆర్ గెలిచారని పేర్కొన్నారు. అప్పుడు కూడా రెండు, మూడు ఏళ్లల్లో అన్ని సర్దుకున్నాయని, వర్షాలు బాగా పడ్డాయని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా.. రెండు, మూడేళ్ల అయితే పరిపాలన కుదురుకుంటుందని తెలిపారు.

## వాడీవేడిగా బీఏసీ

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను మరో ఐదు రోజులపాటు నిర్వహించాలని శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ వెల్లడించారు. ఈనెల 21 వరకూ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నట్లు బీఏసీ ప్రకటించింది. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. ఈ సమావేశంలో అదానీ, రేవంత్ రెడ్డి ఉన్న టీషర్ట్స్ గురించి కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. టీషర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీషర్ట్స్ వేసుకుని వెళ్లడం లేదా అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు. అనంతరం సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశాయి. సభా పనిదినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకే వాకౌట్ చేసినట్లు ఆ పార్టీల నేతలు తెలిపారు.

అయితే అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ సమావేశం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బీఏసీలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరిగ్గా లేదంటూ భట్టి మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నడపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని, పదేళ్లు పాలించిన వారికి ఈ విషయం తెలియదా? అంటూ ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పినట్లే సభా పనిదినాలు ఉండాలంటే ఎలా అని డిప్యూటీ సీఎం మండిపడ్డారు. తాను ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో తెలియదా? అంటూ ధ్వజమెత్తారు. ఇప్పుడు కూడా సభ ఎన్ని రోజులు జరపాలో స్పీకరే నిర్ణయిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

# బీఏసీ అంటే బిస్కట్ చాయ్ సమావేశం కాదు

## బీఆర్ఎస్ పార్టీ బహిష్కరణ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్,16 డిసెంబర్ క్రాంతి న్యూస్



తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరుగుతున్నాయి. అధికార పక్షంపై ప్రతిపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాల అజెండా చర్చించేందుకు సమావేశమైన బీఏసీ సమావేశాన్ని బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించింది. ఈ సమావేశ చాయ్ బిస్కెట్ సమావేశంలాగా మారిందని భావిస్తూ సమావేశం నుంచి గులాబీ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు. వాకౌట్ చేసిన అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కనీసం 15 రోజులు సభ నడపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

బీఏసీ అంటే చాయ్ అండ్ బిస్కెట్ సమావేశం కాదంటూ... ఏమీ తెల్చకపోవడంతో బయటకు వచ్చినట్లు మాజీ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. 'ఎన్ని రోజులు సభ నడుపుతారో చెప్పక పోవడంతో బీఏసీ నుంచి వాకౌట్ చేశాం' అని తెలిపారు. 'రేపు లగచర్ల అంశంపైన చర్చకు మేం పట్టు పడతాం. ఒక రోజు ప్రభుత్వానికి.. మరొక రోజు విపక్షానికి ఇవ్వడం సంప్రదాయం. లగచర్లపైన చర్చకు పట్టుపట్టాం. రైతులకు బేడీలు వేసిన అంశం మాకు చాలా కీలకం' అని వెల్లడించారు. కచ్చితంగా ఈ అంశంపైన చర్చకు అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. బీఏసీకి కేవలం సూచన చేసే అధికారం మాత్రమే ఉందన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలపైన అభ్యంతరం వ్యక్తం చేశారు.

'బీఏసీ చెప్పినట్టే సభ నడుస్తుందది. హౌస్ కమిటీలు ఏర్పాటుచేయాలి. పీఏసీ కమిటీపైన మా పార్టీ అభిప్రాయం కాకుండా ఏట్లా నిర్ణయం తీసుకుంటారు' అని స్పీకర్‌ను మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా చూసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీఏసీ లేకుండా సభలో బిల్లులు ప్రవేశపెట్టడంపైన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు చెప్పారు. పుట్టిన రోజులు, పెళ్లిలు ఉండడంతో సభ వాయిదా వేయడంపైన అభ్యంతరం చేసినట్లు హరీశ్ రావు వెల్లడించారు. ప్రతిరోజు జీరో ఉండాలని డిమాండ్ చేశారు. 'మా పార్టీకి ఉన్న సభ్యుల సంఖ్య మేరకు మాట్లాడే సమయం ఇవ్వాలని కోరాం. మేం టీషర్టులతో వస్తే అడ్డుకున్న తీరు దారుణం. రాహుల్ గాంధీకి లోక్‌సభలో పోయినప్పుడు మమ్మల్ని ఎట్లా అపుతారు? అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

## విలేకరులు కావలెను..

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా?

**నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?**

**మన క్రాంతి తెలుగు దిన పత్రికలో**

పనిచేయుటకు మండలాల వారీగా విలేఖరులు, యాడ్ ఎగ్జిక్యూటివ్ లు (పురుషులు మరియు స్త్రీలు) కావలెను.

కాల్ : 9281041008 వెబ్: https://epaper.krtvnews.com

ఈమెయిల్: krtv.md@gmail.com



# తెలంగాణ

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం.

**జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెంవీరేందర్ రెడ్డి.**



నెక్కొండ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నెక్కొండ మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశము జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ఆదేశానుసారం జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి ప్రధాన కార్యదర్శి మన్నెం వీరేందర్ రెడ్డి సమీక్షంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య ఉద్దేశం 2025 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కోసం నూతన మండలాల ఎన్నికల విషయం మరియు హైకోర్టు సుప్రీంకోర్టు సమాచార పరిరక్షణ కమిటీ వేసిన లేఖలు అనుకూలంగా వచ్చిన లేఖల విషయం గురించి కిందిస్థాయి అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకుంటూ తప్పుడు ధ్రువ పత్రాలను సమాచారం అందిస్తున్న వారిపై ఆయా సెక్షన్ నెంబర్లను అనుసరించి వారిపై పోలీస్ కంప్లైంట్ పెట్టాలని నిర్ణయం చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర గవర్నమెంటు వెంటనే స్పందించి సమాచార హక్కు చట్టం కమిషన్ నియమించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో వరంగల్ ఇన్చార్జ్ పూర్ణ కుమార్, వరంగల్ యూత్ కన్వీనర్ సాదా బోయిన రాజు, న్యాయవాది మహమ్మద్ అలీ, వరంగల్ ఉపాధ్యక్షులు మల్లాడి వీర రెడ్డి, అసెంబ్లీ ఇన్చార్జ్ కుస సుదర్శన్, వర్ధన్నపేట ఇంచార్జ్ నాగరాజు, నర్సంపేట ఇంచార్జ్ జాటో యాకుబ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు చెలుకల పెళ్లి రాజు ప్రధాన కార్యదర్శి గూగులోత్ అమ్రు నాయక్,దుగ్గొండి మండల అధ్యక్షుడు గూడెపు అమరేందర్ మండల ఉపాధ్యక్షుడు మనుబోతుల శివకుమార్ నర్సంపేట మీడియా ఇంచార్జ్ మాదారపు శ్రీనివాస్ నర్సంపేట మండల అధ్యక్షుడు కట్ల మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి నూనె అశోక్ , ఉపాధ్యక్షుడు పుట్ట సురేష్ నెక్కొండ మండల అధ్యక్షుడు జాటోత్ అనిల్ నాయక్ ప్రధాన కార్యదర్శి బానోతు రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు

## భూదేవి హిల్స్ భూముల సర్వే చెయ్యించండి.

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్.**



గాజులరామారం ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):గాజులరామారం రెవిన్యూ పరిది భూదేవిహిల్స్ లో ప్రభుత్వ,ప్రైవేట్ భూములు ఓవర్లాపింగ్ సమస్య ఉందని దానిని అసారా చేసుకొని భూకబ్జాదారులు ప్రభుత్వ భూమిని కూడా తన భూమే అని చెప్పి ప్లాట్లుగా చేసి సుమరు 15 నుండి 20లక్షలకు అమ్ముతు ప్రజలను మోసం చేస్తున్నారని కావున వెంటనే సర్వే నిర్వహించి ఎంత ప్రభుత్వ భూమి,ప్రైవేట్ భూమి ఉందొ తేల్చాలని నేడు కలెక్టరేట్లో ప్రజావాణి సందర్బంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా వరు మాట్లాడుతూ 2018లొ కోర్టు సర్వే చెయ్యాలని ఆదేశాలు ఇచ్చినప్పటికి నేటికీ కూడా సర్వే చెయ్యకపోవడం అధికారుల పనితీరు ఎలా ఉందొ తెలియచేస్తుందని,అధికారుల నిర్లక్ష్యానికి కారణం అలసత్వమా లేక భూకబ్జాదారులతో ఏమైనా లాలూచి పడ్డారా అని ఆలోచించాల్సి వస్తుందని వెంటనే సర్వే చెయ్యకపోతే అదే కోర్టుకు అధికారులను పిలిపించాల్సి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి గారు వెంటనే డీ ఐ గారిని పిలిపించి సర్వే కోసం ఏర్పాట్లు చేసుకొని హద్దులు తేల్చాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ పాల్గొనడం జరిగింది.

## వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేత



కుత్బుల్లాపూర్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ గారి నివాసం వద్ద పలువురు నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి, వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.పలు వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే గారు వాటి పరిష్కారం కోసం, ఆయా కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. పలువురు మాజీ ఎమ్మెల్యే గారికి పలు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు.గాజులరామారం విలేజ్ లో సీసీ రోడ్ సాంక్షన్ చేయించినందుకు సోమవారం స్థానిక విలేజ్ వారు శ్రీశైలం గౌడ్ గారిని సన్మానించారు. అనంతరం శ్రీశైలం గౌడ్ గారు సిసి రోడ్లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కిష్టారెడ్డి, సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, యాం సాగర్, టైసన్, యశ్వంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుజిత్ రెడ్డి, ఋషి కుమార్ లక్ష్మారెడ్డి, వెంకట్ స్వామి, లక్ష్మయ్య, సురేష్ పాల్గొన్నారు

## జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న గ్రూప్ -2 పరీక్ష కేంద్రాలను

**జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తో కలిసి సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**





వికారాబాద్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): వికారాబాద్ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డిలతో కలిసి సందర్శించారు. సోమవారం పట్టణం లో గర్ల్స్ హై స్కూల్, నాగార్జున హై స్కూల్, సిధార్థ హై స్కూల్, బాస్యం,సంగం లక్ష్మి బాయి స్కూల్,శ్రీ చైతన్య స్కూల్, సాయి డెంటల్ కళాశాల, బృంగి ఇంటర్నేషనల్ స్కూల్ లలో జరుగుతున్న పరీక్ష-2 కేంద్రాలను కలెక్టర్ మరియు జిల్లా ఎస్ పి లతో కలిసి పరిశీలించారు. పరీక్ష నిర్వహణ గదులను, వైద్య, ఇతర సౌకర్యాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం లో మౌలిక సదుపాయాలతో పాటు వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.

# అందకారంలో అమ్ముగూడ స్మశాన వాటిక

**• అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణం ? • ఇబ్బంది ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలు • అధికారులు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్..**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):అమ్ముగూడ, యాప్రాల్, కాప్రా ఒక్కటవ డివిజన్ లో గల అమ్ముగూడ గ్రేవియార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పడి 17 సంవత్సరాల క్రితం నిర్మించిన స్మశాన వాటిక, నేడు అధికారుల దృష్టి పెట్టక స్మశాన వాటికలో వసతులు లేక, స్మశాన వాటికకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు సంగోజి పరమేశ్వర్ కుమార్ స్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కోసం బోరు, కాటికాపరి ఉండేందుకు గది, అస్తికలు నిల్వ చేసేందుకు వసతి, విద్యుత్ కలెక్షన్ లాంటివి ఉన్న వీటిని మరమ్మత్తు



చేయకపోవడంతో వృధాగా పనిచేయని దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఎవరైనా వ్యక్తి మృతి చెందితే స్మశాన వాటికకు వస్తే స్థానం చేయడానికి సైతం అక్కడ కనీసం నీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, అధికారులు ఇక్కడ వచ్చిన పాపన పోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు ఇక్కడికి చుట్టుపక్కల నుండి 15 నుండి 20 కిలోమీటర్ల దూరం నుండి ప్రజలు తమ ఇంట్లో ఎవరైనా మృతి చెందితే ఈ స్మశాన వాటికకే తీసుకొని వస్తారని అలాంటి చోట వసతులు లేకపోవడం పట్టణ ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. విద్యుత్ కలెక్షన్ ఉన్న అక్కడి లైట్లు వెలగవని దుస్థితి, కాటికాపరి ఉండేందుకు గది సరిగా లేదని, అస్తికలు నిల్వ చేసుకునేందుకు సరియైన వసతి లేదని వీటిని అన్నిటిని ఏర్పాటు చేయవలసిన బాధ్యత మున్సిపల్ అధికారుల పైనే ఉంటుందని అలాంటి అధికారులు ఈ స్మశాన వాటికను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాలను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, మునిసిపల్ కమిషనర్ తదితర అధికారులు చొరవ చూపిస్తూ వీటిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లి అందమైన వైకుంఠదామంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు రాజకీయ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి ఈ స్మశాన వాటికను అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తానని కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జీవన్ కాన్, అధ్యక్షులు కురిగేషన్, ఉపాధ్యక్షులు శివకుమార్ నారాయణ, ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాష్, కార్యదర్శులు విష్ణు, దినేష్ రాజేష్ సుజిత్, కోశాధికారి శ్రీధరన్, గిల్బర్ట్, కార్యవర్గ సభ్యులు అరుణ్ శివ సతీష్, సోను కుమార్ యువజన సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథుడి విగ్రహం ముందు వంగి ప్రార్థించిన కోడి.



న్యూస్ డెస్క్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):మనుషులతోపాటు కొన్నిసార్లు జంతువులు కూడా దేవుళ్ల పట్ల తమ భక్తిని చాటుతున్నాయి. ఇదే కోవలో ఒక కోడి జగన్నాథ స్వామి విగ్రహం ముందు వంగి మొక్కింది. ఆ దేవుడ్ని ప్రార్థించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒడిశాలోని పూరిలో కొలువైన జగన్నాథుడ్ని ఆ రాష్ట్ర ప్రజలే కాకుండా దేశ నలుమూలల నుంచి భక్తులు దర్శిస్తుంటారు. అలాంటి ఒడిశాలో ఒక వింత సంఘటన జరిగింది. ఒకచోట ఎత్తైన పీటపై జగన్నాథ స్వామి విగ్రహం ఉంది. ఒక కోడి అక్కడకు వచ్చింది. జగన్నాథ స్వామి విగ్రహం ముందు అది వంగి ప్రార్థించింది.కాగా, జగనాథుడ్ని భక్తితో కోడి నమస్కరించిన ఈ వీడియో క్లిప్‌ను 'జగన్నాథ్ ధామ్ పూరి ఎక్స్‌పర్ట్' ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో జగన్నాథుడి భక్తులను ఇది ఎంతో ఆకట్టుకున్నది. వారంతా ఆ కోడి భక్తికి ముగ్ధులయ్యారు. 'విశ్వమంతా ఆయన ముందు తల వంచాలి. ఎందుకంటే ఆయనే విశ్వ సృష్టికర్త' అని ఒకరు పేర్కొన్నారు. 'ప్రతి జీవిలోనూ భగవంతుడు ఉంటాడు. నారాయణుడు ఏ రూపంలో ఉంటాడో ఎవరికీ తెలియదు. జగన్నాథ స్వామికి జై' అని మరొకరు తన భక్తి భావాన్ని చాటారు.



# ఆంధ్ర


## ఏపీ ప్రభుత్వం నయా స్కెచ్



**ఎపి న్యూస్ డెస్క్ ,క్రాంతి న్యూస్:** దేశంలోనే పొడవైన తీరప్రాంతం ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ తర్వాత రెండో స్థానం.. 975 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్ సొంతం.. గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాలతో పాటుగా అనేక చారిత్రక కట్టడాలకు ఆలవాలం ఏపీ. సుందరమైన బీచ్‌లు, అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఎన్నో.. ఇదే విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఆంధ్రప్రదేశ్?ను అన్నిరంగాల్లో అభివృద్ధి వైపుగా నడిపించాలని భావిస్తున్న ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఇదే అంశం మీద దృష్టిపెట్టినట్లు తెలిసింది. రాష్ట్రంలోని సుందర ప్రదేశాలను డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ మధ్యకాలంలో డెస్టినేషన్ వెడ్డింగ్ అనేది ఓ ట్రెండ్‌గా మారిన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ద్వారా మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు సాధారణమైపోయింది. సెలబ్రిటీలు విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లాన్ చేస్తుంటే.. మరికొంతమంది మనదేశంలోని రాజస్థాన్ వంటి చోట్ల వీటిని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఆంధ్రప్రదేశ్‌లోని సుందరమైన ప్రదేశాలను, ప్రాంతాలను ప్రీమియర్ వెడ్డింగ్ డెస్టినేషన్‌లుగా మార్చాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటు సహా ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టి.. వాటిని ప్రీమియర్ వెడ్డింగ్ డెస్టినేషన్‌లుగా మార్చాలని ప్రణాళికలు రచిస్తోంది. త్వరలోనే నూతన పర్యాటక విధానం తీసుకురానున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. వెడ్డింగ్ మార్కెట్‌పైనా ఫోకస్ పెట్టింది. ప్రతి ఏటా సుమారుగా 80 లక్షల వివాహాలు జరుగుతుంటాయని అంచనా. ఆ లెక్కన వెడ్డింగ్ మార్కెట్ విలువ సుమారుగా 12 లక్షల కోట్ల వరకూ ఉంటుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. రాష్ట్రంలో ఉన్న సుందరమైన ప్రాంతాలను డెస్టినేషన్ కేంద్రాలుగా మలచాలని నిర్ణయించింది. ఏపీలో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు వేదికలుగా మార్చేందుకు అనేక ప్రదేశాలు ఉన్నాయి. దీంతో ప్రీమియర్ వెడ్డింగ్ కోసం మరెక్కడికో వెళ్లే అవసరం లేకుండా.. మన రాష్ట్రంలోనే వీటిని నిర్వహించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఈ విషయాన్ని ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అలాగే పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ఏడేళ్లపాటు ఎస్జీఎస్టీ వందశాతం రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. ఏపీలో పురాతన ఆలయాలు, బీచ్‌లు, హిల్ స్టేషన్లు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, చారిత్రక స్థలాలు అనేకం ఉన్నాయి. వీటిని ప్రీమియర్ వెడ్డింగ్‌లకు డెస్టినేషన్ కేంద్రాలుగా మార్చనున్నారు.

## 24 గంటల్లో ఉద్యోగి ఉద్యోగం ఊడింది..

### నారా లోకేష్ స్పాట్ యాక్షన్



స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం
కాణిపాకం- ఐరాల మండలం- చిత్తూరు జిల్లా
ప్రస్తుతం : శ్రీ K. పెంచల కిషోర్, B.Tech, MBA
కార్యనిర్వాహణాధికారి
మరియు ఉప కలెక్టర్
ప్రొసీడింగ్స్ ఇన్ Rc.No.A2/1699/2022, Dt:15.12.2024.

విషయం: దేవదాయ శాఖ - పరిపాలన విభాగం - ది:14-12-2024న శ్రీ స్వామి వారి దేవస్థానమునకు దర్శనార్థమై విచ్చేసిన భక్తులను మభ్యపెట్టి సాధారణ ఆశీర్వాదం టికెట్ ఒకటికి Rs.500/- ను దర్శనం టికెట్ కు బదులు సాధారణ ఆశీర్వాదం టికెట్ జారీ చేసి భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించి దేవాలయ ప్రతిష్ఠకు భంగం కలిగించినందులకు టికెట్ కౌంటర్ నందు విధులు నిర్వర్తించుచున్న శ్రీ జి. కుట్టి బాబు (డైలీవేజ్) వారిని క్రమశిక్షణా చర్యలలో భాగంగా విధుల నుండి నిలుపుదల చేయుచు ఉత్తర్వులు జారీ చేయుట- గురించి.

సూచిక శ్రీ కిషోర్ గౌడ్ @ అమాయకుడు 7.18 M ద్వారా X (Twitter) ద్వారా గౌరవ శ్రీ నారా లోకేష్ మంత్రివర్యుల వారికి చేసిన ఫిర్యాదు తేది:14-12-2024

ఉత్తర్వులు

ది:14-12-2024న స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానమునకు భక్తులు దర్శనార్థమై విచ్చేసిన సందర్భంగా టికెట్ కౌంటర్ నందు దర్శనము టికెట్టుకు వెళ్లగా కౌంటర్ సిబ్బంది సాధారణ ఆశీర్వాదం టికెట్టు ఒకటికి 500 రూపాయలను జారీ చేసి ఉన్నారని, సదరు టికెట్టుపై దర్శనంకు పంపి ఉన్నారని Rs. 500/- సాధారణ ఆశీర్వాదం టికెట్టు నందు ఇద్దరికీ మాత్రమే అని ముద్రించి యున్నదని కానీ తను ఒక్కడికి Rs. 500/- కౌంటర్ సిబ్బంది తీసుకుని సాధారణ ఆశీర్వాదం టికెట్ మంజూరు చేసి ఉన్నారని, ఈ విషయమై సదరు కౌంటర్ సిబ్బందిని విచారించగా ఇక్కడ రూల్స్ ఇంతే అని తెలిపి ఉన్నారని, ఈ విషయంపై కాణిపాక దేవాలయం వారి దోపిడీ చాలా దారుణంగా ఉందని గౌరవ మంత్రివర్యుల వారికి భక్తుడు పై సూచిక ద్వారా ఫిర్యాదు చేసి ఉన్నారు.

ఇందు విషయమై పరిశీలించగా భక్తులు ఆశీర్వాదం పొందుటకు దేవస్థానం వారు సాధారణ ఆశీర్వాదం Rs. 500 /- టికెట్ విక్రయించుట జరుగుచున్నది. ది:14-12-2024న కొంతమంది భక్తులు దర్శనం టికెట్ కొరకు కౌంటర్ సిబ్బందిని కోరగా సదరు భక్తులకు సాధారణ ఆశీర్వాదం టికెట్టు ఒకటికి Rs.500 /- జారీ చేసినట్లు తెలిసినది. దర్శనము కొరకు టికెట్టు జారీచేసి ఉండవలెను. సాధారణ ఆశీర్వాదం టికెట్టుపై భక్తులకు ప్రవేశం లేదు. దర్శనమునకు విడిగా టికెట్టు పొందవలసి ఉన్నది. అయిననూ సదరు కౌంటర్ నందు విధులు నిర్వర్తించుచున్న శ్రీ జి.కుట్టి బాబు (డైలీవేజ్) వారు భక్తులను మభ్యపెట్టి భక్తులకు సరైన సమాధానం చెప్పక Rs. 500 /- సాధారణ ఆశీర్వాదం టికెట్ ను దురుద్దేశపూర్వకంగా విక్రయించి సదరు భక్తులను దర్శనమునకు పంపి యున్నారు. దర్శనమునకు వేరుగా టికెట్ తీసుకొనవలసిన అవసరం ఉన్నను భక్తునికి సరైన సమాధానం చెప్పుటలో కౌంటర్ సిబ్బందికి భక్తునికి ఘర్షణ ఏర్పడినట్లు తెలిసినది.

కావున, శ్రీ స్వామివారి దేవస్థానమునకు విచ్చేయు భక్తులు కోరిన ప్రకారం దర్శనం టికెట్టు జారీ చేయక విధుల నందు నిర్లక్ష్యం వహించి భక్తులను మభ్యపెట్టి సాధారణ ఆశీర్వాదం టికెట్ ఒకటి Rs.500 /-లు విక్రయించి సదరు టికెట్టుపై భక్తుని దర్శనం పంపినట్లు రుజువైనందున టికెట్ కౌంటర్ నందు విధులు నిర్వర్తించుచున్న శ్రీ జి.కుట్టిబాబు (డైలీవేజ్) వారు భక్తునికి సరైన సమాధానం చెప్పుటలో బాధ్యత లేకుండా ప్రవర్తించి దేవస్థాన ప్రతిష్ఠకు భంగం కలిగించినందున దేవాదాయ శాఖ చట్టం 30/87 సెక్షన్ 37 నందలి నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలలో భాగంగా శ్రీ జి.కుట్టి బాబు (డైలీవేజ్) వారిని ది:15-12-2024న విధుల నుండి నిలుపుదల చేయుచు ఉత్తర్వులు జారీ చేయడమైనది

సం/- కె. పెంచల కిషోర్
కార్యనిర్వాహణాధికారి
మరియు ఉప కలెక్టర్

//అనుమతిన//

**ఎపి న్యూస్ డెస్క్ ,క్రాంతి న్యూస్:** సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన దృష్టికి వచ్చే సమస్యలను వేగంగా పరిష్కరిస్తుంటారు ఏపీ మంత్రి నారా లోకేష్. సాయం కోరుతూ వచ్చ వినతుల దగ్గర నుంచి .. ఫిర్యాదుల వరకూ అన్నింటిమీద సత్వరమే స్పందిస్తుంటారు. తాజాగా కాణిపాకం ఆలయానికి సంబంధించి ఓ భక్తుడి నుంచి నారా లోకేష్‌కు ఫిర్యాదు అందింది. కాణిపాకం వినాయకుడి దర్శనం కోసం వచ్చిన ఓ భక్తుడితో కాణిపాకం ఆలయ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారు. ఈ విషయంపై సదరు భక్తుడు నారా లోకేష్‌కు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన నారా లోకేష్ విచారణకు ఆదేశించగా.. ఆరోపణలు నిజమని తేలటంతో ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కిషోర్ గౌడ్ అనే భక్తుడు శనివారం కాణిపాకం ఆలయానికి వచ్చారు. స్వామివారి దర్శనం కోసం రూ.500 చెల్లించి సాధారణ ఆశీర్వచన టికెట్ తీసుకున్నారు. ఈ టికెట్ కింద ఇద్దరు భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతి ఉంటుంది. కానీ రూ.500 చెల్లించిన ఒకరినే దర్శనానికి అనుమతిస్తామని కాణిపాకం సిబ్బంది కిషోర్ గౌడ్‌కు చెప్పారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటనను కిషోర్ గౌడ్ ఎక్స్ వేదికగా నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. నారా లోకేష్ అన్న.. కాణిపాకం దేవాలయంలో దోపిడీ దారుణంగా ఉందని.. రూ.500 టికెట్ తీసుకుంటే ఒక్కరినే దర్శనానికి అనుమతిస్తారని.. అడిగితే రూల్స్ ఇంతే ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో అన్నారంటూ ట్వీట్ ద్వారా తన ఆవేదన తెలియజేశారు. కిషోర్ గౌడ్ ట్వీట్‌కు నారా లోకేష్ స్పందించారు. అలాగే ఏపీ దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి కూడా విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన ఆలయ ఈవో పెంచల కిషోర్.. ఆలయ సిబ్బంది తప్పు ఉందని గుర్తించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జి. కుట్టి బాబు అనే ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాణిపాకం వినాయకుడి దర్శనం కోసం వచ్చిన భక్తులను సాధారణ ఆశీర్వాదం టికెట్ ఒకరికే అని మభ్యపెట్టడమే కాకుండా.. భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించి దేవాలయ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు టికెట్ కౌంటర్‌లో పనిచేస్తున్న జి. కుట్టి బాబును విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవైపు సాధారణ ఆశీర్వాదం టికెట్‌పై భక్తులకు ప్రవేశం లేదన్న ఆలయ ఈవో.. దర్శనానికి విడిగా టికెట్ తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని టికెట్ కౌంటర్లో ఉన్న సిబ్బంది భక్తులకు తెలియజేయాలని.. కానీ అలా చెప్పకుండా వారితో దురుసుగా ప్రవర్తించిన కుట్టి బాబును విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## టీడీపీ ర్యాలీలో వైసీపీ మాజీ మంత్రి..

- ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం
- టీడీపీ ర్యాలీలో వైసీపీ మాజీ మంత్రి
- మంత్రితో కలిసి పాల్గొనడంపై చర్చ



**ఎపి న్యూస్ డెస్క్ ,క్రాంతి న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర సీన్ కనిపించింది. వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి టీడీపీ మంత్రితో కలిసి ర్యాలీలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. నూజివీడు నియోజకవర్గంలో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొలుసు పార్థసారథి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించగా.. మాజీ మంత్రి జోగి రమేష్ కూడా హాజరయ్యారు. నూజివీడు బస్టాండు సెంటర్‌లో ఏర్పాటుచేసిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ప్రారంభించారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్న పార్థసారథితో కలిసి నూజివీడు పురపాలక పరిధిలో కలిసి ర్యాలీగా తిరగడం ఆసక్తికరంగా మారింది. కొంతకాలంగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించని జోగి రమేష్ మంత్రి పార్థసారథితో కలిసి ర్యాలీగా తిరగడం, గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో పాల్గొనటం, టీడీపీ నేతలతో యాక్టివ్‌గా కనిపించడం ఆసక్తికరంగా మారింది. దీంతో జోగి రమేష్ టీడీపీలోకి వస్తారా అనే చర్చ కూడా మొదలైంది. బలహీనవర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు మంత్రి కొలుసు పార్థసారథి. గౌతు లచ్చన్న గొప్ప నాయకుడని.. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జాతీయ నాయకుడని, శతజయంతి ఉత్సవాలను 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించారని గుర్తుచేశారు మాజీ మంత్రి జోగి రమేష్ . అతి తక్కువ కాలం మంత్రి పదవిని ర్వహించిన గౌతు లచ్చన్నను రాష్ట్రం మొత్తం గు ర్తుంచుకుందన్నారు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష. ఇది ప్రజానాయకులకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. జోగి రమేష్ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. చంద్రబాబు ఇంటిపై దాడి ఘటనలో ఇటీవల కేసు కూడా నమోదైంది. రమేష్ కుమారుడిపై అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో కేసు నమోదైంది. జోగి రమేష్ పోలీసుల విచారణకు కూడా హాజరయ్యారు. ఇప్పుడు ఉన్నట్టుండి జోగి రమేష్ టీడీపీ ర్యాలీలో కనిపించడం చర్చనీయాంశమైంది. టీడీపీవైపు అడుగులు వేస్తున్నారా అనే చర్చ జరుగుతోంది. అయితే గౌతు లచ్చన్న విగ్రహ ఆవిష్కరణకు రాజకీయాలకు సంబంధం లేదనే చర్చ కూడా జరుగుతోంది.

## శ్రీశైలం ఆలయానికి పోటెత్తిన భక్తులు..




**శ్రీశైలం,క్రాంతి న్యూస్ :** ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆరుద్ర నక్షత్రం, సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ క్రమంలో క్షేత్ర వీధులన్నీ భక్తులతో కిటకిటలాడగా.. శివన్నామస్మరణతో మార్మోగాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వామి అమ్మవార్లకు జరిపే నిత్య ఆర్జిత సేవలు యధాతథంగా కొనసాగిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



## 103 ఎకరాల్లో ఏపీ అసెంబ్లీ..

**ఎపి న్యూస్ డెస్క్ ,క్రాంతి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నిర్మాణాలకు టీడీపీ కూటమి సర్కారు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే రాజధాని అమరావతికి ఓ రూపు తీసుకువచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే అమరావతిలో చేపట్టాల్సిన అనేక పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా సీఆర్‌డీఏ మరోసారి సమావేశమైంది. తాజా సమావేశంలో కొత్తగా రూ.24,276 కోట్ల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఇప్పటి వరకూ అమరావతిలో రూ.45,249 కోట్లకు సీఆర్‌డీఏ ఆమోదం లభించిందని మంత్రి చెప్పారు. మరోవైపు రాజధాని అమరావతిలో రెండు సంవత్సరాల్లోగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. నిర్మాణ సముదాయాలను 9 నెలల్లోగా పూర్తి చేస్తామని చెప్పారు. సోమవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్ పనులకు ఆమోదం లభించిందని నారాయణ చెప్పారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను మూడు రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. అమరావతిలో ఐదు ఐకానిక్ టవర్లు నిర్మించనున్నామన్న మంత్రి పొంగూరు నారాయణ.. ఐదు ఐకానిక్ టవర్ల కోసం రూ.4,665 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. అలాగే ఏపీ హైకోర్టు నిర్మాణానికి రూ.1,048 కోట్లు, అసెంబ్లీ భవనానికి రూ.768 కోట్లు ఖర్చు చేసేందుకు సీఆర్డీఏ ఆమోదం తెలిపిందని వివరించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ భవనాన్ని 103 ఎకరాల్లో నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు రూ.768 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలాగే నగరం మొత్తం కనిపించేలా అసెంబ్లీపై టవర్ ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాల రోజుల్లో



మినహా మిగతా రోజుల్లో అసెంబ్లీ టవర్ చూడ్డానికి సందర్శకులను అనుమతించనున్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ వెల్లడించారు. అలాగే నాలుగు జోన్లలో రోడ్ల టెండర్లకు రూ.9,699 కోట్లు , ట్రంక్ రోడ్లకు రూ.7,794 కోట్లు ఖర్చు చేసేందుకు సీఆర్‌డీఏ ఆమోదం లభించిందని మంత్రి నారాయణ వివరించారు. కేబినెట్ సమావేశంలో వీటికి ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి.

## అల్లు అర్జున్ ఎర్ర చొక్కా.. బన్నీ షర్ట్ గురించి నెట్టింట చర్చ?



**ఎపి న్యూస్ డెస్క్ ,క్రాంతి న్యూస్:** సోషల్ మీడియా.. అదో మాయా ప్రపంచం.. లేనిది ఉన్నట్లు భ్రమింపజేయగలదు. ఉన్నదానిని లేదంటూ నమ్మించనూగలదు. ట్రెండింగ్ విషయం ఏదైనా సరే ఎవరి జోస్యాలు, అంచనాలు, విశ్లేషణలు, వాదనలు వారివే. దానికి వచ్చే కౌంటర్లు, వేసే రివర్స్ కౌంటర్లు.. అలా అలా సాగిపోతాయంతే. ఇక విషయానికి వస్తే తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కాలంలో చర్చనీయాంశమైన ఘటనలు రెండే రెండు. ఒకటి మంచు మోహన్ బాబు కుటుంబ వ్యవహారం.. రెండోది అల్లు అర్జున్ అరెస్ట్ సంగతి. మంచు వారింట పంచాయతీ ఇంకా సాగుతూనే ఉంది. రెండోది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం. దీనిపై జాతీయ స్థాయిలోనూ చర్చ జరిగింది. కేంద్ర మంత్రులు కూడా దీనిపై స్పందించారంటే ఈ విషయం ఇంపాక్ట్ ఎంతగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. అయితే సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై అల్లు అర్జున్ అరెస్ట్ కావటం.. ఒక రోజు చంచల్ గూడ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత మధ్యంతర బెయిల్ మీద అల్లు అర్జున్ బయటకు వచ్చారు. అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్న తర్వాత సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనను కలిసి పరామర్శించారు. అరెస్ట్ వ్యవహారం గురించి చర్చించారు. అలాగే అల్లు అర్జున్ కూడా చిరంజీవి, నాగబాబు ఇంటికి వెళ్లారు. సతీసమేతంగా అల్లు అర్జున్ చిరంజీవి, నాగబాబు ఇళ్లకు వెళ్లారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో అనేక ట్వీట్లు, పోస్టులు వైరల్ అవుతున్నాయి. అలాగే ఓ ఎక్స్ యూజర్ పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది. చిరంజీవి, నాగబాబు ఇంటికి వెళ్లిన సమయంలో అల్లు అర్జున్ ఎర్ర చొక్కా వేసుకోవటం గురించి సదరు యూజర్ తనదైన విశ్లేషణ చేశారు. అల్లు అర్జున్ జైలు నుంచి విడుదల అయిన తర్వాత చిరంజీవి, నాగబాబు ఇంటికి తొలిసారిగా వెళ్లారని.. అప్పుడు ఎర్రచొక్కా వేసుకున్నారంటూ యూజర్ రాసుకొచ్చారు. ఎర్ర చొక్కా జనసేన పార్టీకి చిహ్నమంటూ తనదైన విశ్లేషణ చేశారు. మెగా ఫ్యామిలీ గురించి, జనసేన గురించి ఇక అల్లు అర్జున్ ఫ్యాన్స్ విషపు ప్రచారం ఆపాలని రాసుకొచ్చారు. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి మెగా ఫ్యాన్స్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ మధ్య సోషల్ మీడియా వేదికగా వార్ మొదలైంది. వైసీపీ అభ్యర్థి శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డికి మద్దతుగా అల్లు అర్జున్ నంద్యాలకు వెళ్లటంతో ఈ ఫ్యాన్ వార్ ముదిరింది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ అభిమానులు సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకోవటం మొదలెట్టారు. అయితే అల్లు అర్జున్ అరెస్ట్ సమయంలో మెగాస్టార్ చిరంజీవి, నాగబాబు అల్లు అర్జున్ ఇంటికి వెళ్లటం వారికి ధైర్యం చెప్పడం.. అలాగే జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత బన్నీ కూడా చిరంజీవిని, నాగబాబుకు కలవటంతో ఈ ఫ్యాన్ వార్‌కు ఫుల్ స్టాప్ పడినట్టేనని భావిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ రైతులకు తీపికబురు 35 శాతం సబ్సిడీ



**ఎపి న్యూస్ డెస్క్ ,క్రాంతి న్యూస్:** రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు వినిపించింది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్, ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందించాలన్న అచ్చెన్నాయుడు.. ఈ కార్యక్రమాన్ని మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వారితో చర్చించారు. అలాగే చిరుధాన్యాలు, తృణధాన్యాలు సాగు, వినియోగం పెంచేలా రైతులకు విత్తనాలపై రాయితీ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 35 శాతం రాయితీపై గోడౌన్లను అద్దెకు ఇవ్వాలని ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు రాయితీపై పచ్చి రొట్టె విత్తనాలు, ఎరువులు అందించి, భూసారం పెంపు, నాణ్యమైన దిగుబడి వచ్చేలా కృషి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను అన్నదాతలు నూరు శాతం సద్వినియోగం చేసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే రబీ, ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు జిల్లాలలో సాగుచేసే పంటల ఆధారంగా విత్తనాలు, ఎరువుల అంచనా నివేదికను ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మరోవైపు మార్కెట్ యార్డు గోదాముల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను నిలువ ఉంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. గిట్టుబాటు ధర వచ్చేవరకూ పంట ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేలా రైతులకు నామమాత్రపు ధరకు గోడౌన్లను అద్దెకు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ అద్దెలోనూ 35 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా రైతన్నలపై ఆర్థిక భారం పడకుండా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు పలాసలో టీడీపీ నేతను హత్యచేసేందుకు కుట్ర చేశారనే వార్తలపైనా మంత్రి స్పందించారు. శ్రీకాకుళం ఎస్పీ, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దీని వెనుక ఎంతటి వారున్నా కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టీడీపీ పాలనలో హత్యా రాజకీయాలకు తావులేదని అచ్చెన్న చెప్పారు.

# వామ్మో ప్లేటు భోజనం ₹ 32 వేలు?

- వందమందికి ఖర్చు రూ.32 లక్షలు!
- రాజన్న ఆలయమే చెల్లించాలని ఉన్నతాధికారి ఒత్తిడి
- సీఎం రేవంత్‌రెడ్డి సహా వందమందికి ఖర్చు రూ.32 లక్షలు
- వేములవాడ రాజన్న గుడికి బిల్లులు పంపిన తాజ్‌కృష్ణ
- ఆలయ చైర్మన్ చాంబర్‌నే హోటల్‌గా మార్చేసిన సిబ్బంది
- ఒక్కో పట్టు పంచెకు పదివేలు ఖర్చు పెట్టిన అధికారులు
- తాగే గ్లాస్ నుంచి టేబుల్ వరకు విందుకోసం కొనుగోలు
- రాజన్న దర్శనంతో కలిపి మొత్తం ఖర్చు కోటీ 70 లక్షలు!
- బిల్లు మొత్తం ఆలయమే చెల్లించాలని ఉన్నతాధికారి ఒత్తిడి
- సిరిసిల్ల కలెక్టర్ వద్దకు చేరిన ఫైలు.. తెరపైకి పంచాయితీ





కరీంనగర్, క్రాంతి న్యూస్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయనతోపాటు వచ్చిన మంత్రులు, అధికారులు, ఇతర వీవీఐపీల భోజనాల కోసం పెట్టిన ఖర్చు అక్షరాలా రూ.32 లక్షలు! మొత్తంగా వంద మందికి భోజనాలు! అంటే ఒక్కొక్కరి భోజనానికి పెట్టిన ఖర్చు సగటున రూ.32 వేలు!! ఇదేదో బడాబాబుల ఇండ్లలో జరిగిన ప్రైవేట్ ఫంక్షన్ తాలూకా ఖర్చు అనుకుంటే పొరపాటు. ఇది సాక్షాత్తు వేములవాడ రాజన్న ఆలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించిన సందర్భంగా కేవలం భోజనాల కోసం పెట్టిన ఖర్చు! అక్కడ వంద మందికి భోజన ఏర్పాట్లు చేసిన హైదరాబాద్‌కు చెందిన హోటల్ తాజ్‌కృష్ణ నిర్వాహకులు ఆలయ అధికారులకు పంపిన బిల్లు ఇది. భోజనాలతోపాటు పట్టుపంచెలు, ఇతర మర్యాదల కోసం పెట్టిన మొత్తం ఖర్చు సింపుల్‌గా రూ.కోటీ 70 లక్షలు! ఇంత బిల్లు చెల్లించడం తమ వల్ల కాదని రాజన్న ఆలయ అధికారులు చెప్తుండగా, ఈ 'పేమెంట్ చేయాల్సిందే'నంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దీంతో దిక్కుతోచని ఆలయ అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. నిత్యం కడుపు కాల్చుకొని పైసాపైసా కూడబెడుతున్నామని పదేపదే చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఖర్చుపై ఎలా స్పందిస్తారో మరి.

## ఆలయ నిబంధనలూ మంట గలిపారు!

ప్రజాపాలన విజయోత్సవాల పేరిట గత నెల 20న వేములవాడలో కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు వేములవాడకు వచ్చారు. వీరితోపాటు ఇతర వీఐపీలకు అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికిన అధికారులు ఆ తర్వాత రాజన్న దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వంద మంది వీఐపీలకు భోజనాలు పెట్టేందుకు హైదరాబాద్ నుంచి తాజ్ హోటల్ సిబ్బంది వచ్చారు. దేవస్థానం చైర్మన్‌కు చెందిన చాంబర్‌నే ఫైవ్‌స్టార్ హోటల్‌గా మలిచి అక్కడే వండి భోజనాలు పెట్టారు. అందులోకి మీడియాను అనుమతించలేదు. కేవలం ఎంపికచేసిన వీఐపీలు మాత్రమే వెళ్లారు. దేవాలయానికి ఆనుకొని ఉన్న చైర్మన్ చాంబర్‌ను ఒక హోటల్‌గా మార్చడం నిబంధనలకు విరుద్ధం. సదరు హోటల్ నిర్వాహకులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టారు. మొత్తం వంద మంది వీఐపీలకు వంట చేసి భోజనాలు పెట్టినట్టు చెప్పిన సదరు హోటల్ యాజమాన్యం, అందుకు సంబంధించిన బిల్లులను తాజాగా రాజన్న ఆలయ ఈవోకు పంపినట్టు అలయ అధికారుల ద్వారా తెలిసింది. అందులో భోజనం ఖర్చు రూ.17 లక్షలు, ట్రాన్స్‌పోర్ట్, వెయిటర్, భోజనాల కోసం వేసిన డెకరేషన్ ఖర్చులు కలిపి రూ.15 లక్షలుగా పేర్కొన్నది. వంద మంది భోజనాల ఖర్చు కింద రూ.32 లక్షలు చెల్లించాలని పేర్కొంటూ బిల్లులు పంపారనేది అత్యంత విశ్వసనీయ సమాచారం. అంటే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులతో కలిపి చూస్తే ఒక్కో వీఐపీ ఆ రోజు చేసిన భోజనం ఖరీదు రూ.32 వేలు అన్నమాట!

## 10 వేలతో పట్టు పంచెలు?

సాధారణంగా ముఖ్యమంత్రితోపాటు ఇతర మంత్రులు వచ్చినప్పుడు.. దేవాదాయ శాఖ కొన్ని సంప్రదాయాలు పాటించాల్సి ఉంటుంది. ఇక్కడ అది శ్రుతి మించింది. తొలుత ముఖ్యమంత్రికి రూ.పది వేల విలువైన పట్టుపంచె, మంత్రులు, ఇతర వీఐపీలకు అంత కంటే తక్కువ ఖర్చుతో పట్టుపంచెలను తెప్పించినట్టు తెలిసింది. కానీ, జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి జోక్యం చేసుకొని, ముఖ్యమంత్రి తరహాలోనే మంత్రులకు, వీఐపీలకు కూడా పట్టుపంచెలు పెట్టాలని హుకుం జారీ చేయడంతో ఆలయ అధికారులు అప్పటికప్పుడు అదే ధరతో కూడిన పట్టువస్త్రాలు తెప్పించినట్టు సమాచారం. అంతేకాదు, ముఖ్యమంత్రి వస్తున్నారని పేర్కొంటూ.. తాగే గ్లాస్ నుంచి తినే పళ్లెం వరకు, కుర్చీ నుంచి టేబల్ వరకు.. ప్రతి వస్తువు కొత్తది తెప్పించినట్టు విశ్వసనీయ సమాచారం. అందుకోసం సుమారు రూ.కోటి నలభై లక్షల వరకు వెచ్చించినట్టు తెలుస్తున్నది. అంటే ముఖ్యమంత్రి రాజన్న దర్శనానికి వచ్చిన సందర్భంగా భోజనాలు, ఇతర వస్తుల ఖరీదు కలసి రూ.కోటీ 70 లక్షలకుపైగా ఖర్చు పెట్టినట్టు సమాచారం. ఇవన్నీ బహిరంగ సభ వద్ద జరిగిన ఖర్చులతో సంబంధం లేకుండా కేవలం ఆలయ ప్రాంగణ పరిధిలో జరిగిన ఖర్చులు మాత్రమేనని తెలుస్తున్నది.

## తెరపైకి పంచాయితీ?

భోజన బిల్లులు రూ.32 లక్షలు కావడంతో అసలు పంచాయితీ తెరపైకి వచ్చినట్టు సమాచారం. ఈ బిల్లులు రాజన్న ఆలయం నుంచి చెల్లిస్తారని ఒక ఉన్నతాధికారి చెప్పిన మేరకు హోటల్ యాజమాన్యం రాజన్న ఆలయ ఈవోకు బిల్లులు పంపించింది. అయితే భోజనాలకు ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించడం తమ వల్ల కాదంటూ దేవాలయ అధికారులు తేల్చిచెప్పగా.. జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి 'లేదు.. లేదు. కచ్చితంగా చెల్లించాలి' అని ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఆలయ అధికారులు మాత్రం ఆ బిల్లులు చెల్లించకుండా.. ఫైల్ తయారుచేసి రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌కు పంపించినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫైలు కలెక్టర్ వద్ద పరిశీలనలో ఉన్నది. ఈ బిల్లులు కలెక్టర్ తన ఖాతా నుంచి చెల్లిస్తారా? లేక తిరిగి రాజన్న ఆలయానికి పంపిస్తారా? అనే అంశంపై చర్చ నడుస్తున్నది. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ప్రొటోకాల్ పాటించడం సహజమే అయినా ఏకంగా ఫైవ్‌స్టార్ హోటల్‌నే దేవస్థానం పరిధిలోకి తెప్పించడం, లక్షల ఖర్చులతో భోజనాలు చేయడం ఎంతవరకు సమంజసమని దేవాలయ అధికారులే చర్చించుకుంటున్నారు. గతంలో అనేకమంది సీఎంలు వచ్చి వెళ్లారని, ఏనాడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని ఆలయ వర్గాలు చెప్తున్నాయి. ఒక ఉన్నతాధికారి ఆదేశాల మేరకు అనుమతి లేకుండా కొనుగోలు చేసిన ఫర్నీచర్‌కు కూడా బిల్లులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని అధికారులు లోలోన మధనపడుతున్నట్టు తెలుస్తున్నది. మొత్తంగా ఈ సమస్య ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన రాజన్న ఆలయ ఉద్యోగుల్లో వ్యక్తం అవుతుండగా.. వంద మంది వీఐపీలకు ఏకంగా రూ.32 లక్షలు ఖర్చు పెట్టి భోజనాలు పెట్టడం అవసరమా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్‌కు ఢిల్లీ కోర్టు నోటీసులు





ఢిల్లీ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్‌కు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. మాజీ మంత్రి సత్యేందర్ జైన్ క్రిమినల్ పరువు నష్టం కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆమెకు రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు పంపింది. ఈ కేసు విచారణ ఈ నెల 20న జరుగనున్నది. బన్సూరి స్వరాజ్‌పై సత్యేంద్ర జైన్ పరువు నష్టం దావా వేశారు. గతేడాది అక్టోబర్ 5న ఓ టీవీ ఇంటర్వ్యూలో తనపై ఆమె అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె చేసిన చేసిన వ్యాఖ్యలు తన ప్రతిష్టను దిగజార్చాయన్నారు. తనను అప్రతిష్టపాలు చేయడానికి, తద్వారా రాజకీయంగా మైలేజీని పొందేందుకు ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. తన నివాసం నుంచి రూ.3కోట్లు, 1.8 కిలోల బంగారం, 133 బంగారు నాణెలు స్వాధీనం చేసుకున్నట్లుగా తప్పుడు వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ ఆరోపణలు నిరాధామని.. రాజకీయంగా తన ప్రతిష్టను దిగజార్చేందుకే ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. తనను అవినీతిపరుడు, మోసగాడు అంటూ మరింత పరువు తీశారని ఆయన పేర్కొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

**అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్**

**79 దరఖాస్తుల రాక**



సిరిసిల్ల,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ప్రజావాణికి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఆయా శాఖలకు వస్తున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారుఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సిరిసిల్ల,వేములవాడ వెంకట ఉపేందర్ రెడ్డి,రాజేశ్వర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు

## సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ను కలిసిన కాంగ్రెస్ పార్టీ విద్యార్థి నాయకులు



ముస్తాబాద్,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నుండి సిద్దిపేట కామారెడ్డి రూట్ లో వెళ్లే బస్సులను ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ మోడల్ స్కూల్ వద్ద విద్యార్థుల సౌకర్యం కొరకు రిక్వెస్ట్ స్టాప్ పెట్టి బస్సు ఆపాలని కోరుతూ సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ను కలిసిన ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మిడిదొడ్డి భాను కుమార్ వినతి పత్రం అందజేశారు అందుకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి విద్యార్థుల సౌకర్యం కొరకు మోడల్ స్కూల్ వద్ద బస్సును ఆపుటకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు ఈకార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మీడిదొడ్డి భాను కుమార్, టీం కె. కె పోతారం నవీన్ గౌడ్, పోతారం వంశీ గౌడ్, కొట్టురి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పనిచేద్దాం బిజెపి పార్టీని బలోపేతం చేద్దాం

**వికారాబాద్ నియోజకవర్గ, బిజెపి పార్టీ కోఆర్డినేటర్, జిల్లా దిశా కమిటీ మెంబెర్ "వడ్ల నందు.**





వికారాబాద్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):సోమవారం వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోట్ పల్లి మండల కేంద్రంలో, బంట్వారం మండల పరిధిలోని సల్బత్తాపూర్, మద్వాపూర్ గ్రామాలలో వికారాబాద్ నియోజకవర్గ, బిజెపి పార్టీ కోఆర్డినేటర్, జిల్లా దిశా కమిటీ మెంబెర్ "వడ్ల నందు", కోట్ పల్లి మండల ఎన్నికల అధికారి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బంట్వారం మండల అధ్యక్షులు మహేష్ యాదవ్, మండలాల ప్రధాన కార్యదర్శులు చంద్రయ్య, మల్లేశం, నాగరాజ్, సీనియర్ నాయకులు పతంగె పాండు, శివకుమార్, తాజా మాజీ ఎంపీటీసీలు బందయ్య, శ్రీకాంత్ రెడ్డి, శరణ రెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, గోవింద్ రెడ్డి, రాములు, బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, తలారి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి...

**ప్రజానాట్యమండలి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్...**



హనుమకొండ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):అర్హులైన కళాకారులందరికి కల్చరల్ గుర్తింపు కార్డులు ఇవ్వాలి అని తెలంగాణ ప్రజానాట్యమండలి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు గన్నారపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర విజయ్ కుమార్ అలియాస్ కృష్ణ అన్నారు. సోమవారం తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో వరంగల్ జిల్లా జైయిట్ కలెక్టర్ సంధ్యారాణిని కలిసి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వినతి పత్రము ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి ప్రజా కళాకారులుగా కల కోసం కాదు కళ ప్రజల కోసం అని నమ్మి సామాజిక రుగ్మతలు మధ్యపానాన్నిషేధం, వరకట్న దురాచారాలు, నిరక్షరస్యత వంటి కార్యక్రమాలు వేలాది ప్రదర్శనలు ఇస్తూ ప్రజలను చైతన్యవంతులను చేశామని చెప్పారు. అంతేకాకుండా తెలంగాణ మలి దశ ఉద్యమంలో సీమాంధ్ర పెట్టుబడిదారుల వలస ఆంధ్ర ఆధిపత్యాన్ని అహంకారాన్ని ప్రశ్నిస్తూ మట్టి పాటల పూదోటలై వేలాది వేదికలపై ధూమ్ దామ్ లు,ఆట -పాట- మాట నీ పాటనై వస్తున్న నమ్మ అంటూ పల్లె పల్లె తిరుగుతూ ప్రజలను చైతన్యవంతులను చేశారు.ఈ కార్యక్రమంలో కడమంచి చిన్న యాదగిరి, కుంట శాంతి, ఆముదాల సుమలత,ముత్యాల శ్రీలత, ముద్ర బోయిన సాంబయ్య, కడమంచి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి
మంగళవారం 17 డిసెంబర్ 2024

# ఆరోగ్య క్రాంతి



## రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో అవకాడోలను తింటే ఏం జరుగుతుందంటే..?



హెల్త్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): మార్కెట్‌లో మనకు తినేందుకు అనేక రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో అవకాడోలు కూడా ఒకటి. ఇవి ఎక్కువగా మనకు సూపర్ మార్కెట్‌లలో లభిస్తాయి. ఇవి ధర కాస్త ఎక్కువే ఉంటాయి. కానీ ఈ పండ్లు అందించే ప్రయోజనాలు బోలెడు అనే చెప్పాలి. అవకాడోలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు. అవకాడోలు మనకు పోషణను అందిస్తాయి. రోగాలను నయం చేస్తాయి. ఇంకా ఎన్నో లాభాలను అందిస్తాయి. అవకాడోలను నేరుగా తినవచ్చు. లేదా స్మూతీలు, సలాడ్స్ రూపంలోనూ తీసుకోవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.కొలెస్ట్రాల్ స్థాయిలు..

అవకాడోలను ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా తినాల్సి ఉంటుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఎంత పనిచేసినా అలసిపోరు. అలాగే ఈ పండ్లలో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ముఖ్యంగా ఓలియిక్ యాసిడ్ ఉంటుంది. ఇది మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతుంది. దీంతో ఆరోగ్యంగా ఉంటారు. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**అధిక బరువు తగ్గుతారు..**

అవకాడోలలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రాముల అవకాడోలను తింటే సుమారుగా 7 గ్రాముల మేర ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో సుఖ విరేచనం అవుతుంది. మలబద్దకం తగ్గుతుంది. షుగర్ లెవల్స్ సైతం కంట్రోల్ అవుతాయి. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా ఉంటుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. అవకాడోలలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రాముల అవకాడోలను తింటే సుమారుగా 485 మిల్లీగ్రాముల మేర పొటాషియం లభిస్తుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడులు సక్రమంగా పనిచేసేలా చేస్తుంది. దీంతో కాలి పిక్కలు పట్టుకుపోకుండా చూడవచ్చు. నొప్పులు కూడా తగ్గుతాయి.

**రోగ నిరోధక శక్తికి..**

ఒక మీడియం సైజు అవకాడోను తినడం వల్ల విటమిన్ కె సమృద్ధిగా లభిస్తుంది. ఇది మనకు రోజుకు కావల్సిన విటమిన్ కె లో 20 శాతంతో సమానం. విటమిన్ కె గాయాలు అయినప్పుడు తీవ్ర రక్త స్రావం అవకుండా రక్తం గడ్డ కట్టేందుకు ఎంతగానో సహాయ పడుతుంది. తరచూ అవకాడోలను తినడం వల్ల ఎముకలు సైతం ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. అవకాడోలలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రాముల అవకాడోలతో సుమారుగా 10 మిల్లీగ్రాముల మేర విటమిన్ సి లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను మెరుగ్గా పనిచేసేలా చేస్తుంది. దీంతోపాటు చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కనుక అవకాడోలను రోజూ తింటుంటే అనేక విధాలుగా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## పుట్ట గొడుగులు తింటే ఇంత మేలు చేస్తాయా..

హెల్త్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): శీతాకాలంలో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలకు పుట్టగొడుగులు చెక్ పెడతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు గుండె, జీర్ణ సమస్యలు, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యల నుంచి పుట్టగొడుగులు కాపాడతాయి. ఈ చలికాలం పుట్టగొడుగులతో రకరకాల పదార్థాలు చేసుకొని, ఆరగించినట్లయితే.. రుచితోపాటు ఆరోగ్యాన్నీ పొందొచ్చు. పుట్టగొడుగుల్లో యాంటి ఆక్సిడెంట్లు, బీటా – గ్లూకాన్ వంటి పోషకాలు ఎక్కువ. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. చలికాలంలో ఎదురయ్యే ఇన్‌ఫెక్షన్ల నుంచి పోరాడే శక్తినిస్తాయి. ఇందులో ఉండే సెలీనియం లాంటి శక్తివంతమైన యాంటి ఆక్సిడెంట్లు.. శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ను తగ్గిస్తాయి.వీటిల్లో కేలరీలు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటాయి. ఫలితంగా, గుండె జబ్బుల నివారణలో కీలకంగా పనిచేస్తాయి. మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పులు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక సమస్యల నుంచి పుట్టగొడుగులు గట్టెక్కిస్తాయి.పుట్టగొడుగుల్లో లభించే పాలీశాకరైడ్స్.. శరీరంలో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయని వివిధ పరిశోధనల్లో వెల్లడైంది. ముఖ్యంగా.. రొమ్ము క్యాన్సర్, ప్రొస్టేట్, పెద్దపేగు క్యాన్సర్ నుంచి కాపాడటంలో పుట్టగొడుగులు ముందుంటాయి.సోడియం తక్కువగా ఉండటంతో కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించడంలోనూ ముందుంటాయి. బరువు తగ్గించేందుకు, జీర్ణ సమస్యల నుంచి బయట పడేందుకూ పుట్టగొడుగులు సాయపడుతాయి. పేగుల ఆరోగ్యాన్ని కాపాడి.. జీర్ణ సమస్యల నుంచి విముక్తికల్పిస్తాయిమష్రూమ్స్‌లో రిబోఫ్లావిన్, నియాసిన్, పాంటోథినిక్ యాసిడ్‌లు, విటమిన్లూ.. ఎక్కువే! ఇవి జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తాయి.



## చలికాలంలో రోజూ రాత్రి చిన్న బెల్లం ముక్కను తినడం మరిచిపోవద్దు..



హెల్త్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్):

ప్రస్తుతం నగరాలు, పట్టణాలే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ కాలుష్యం ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా రోడ్లపైకి వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతోంది. దీంతో గాలి కాలుష్యం ఎక్కువవుతోంది. ఫలితంగా చాలా మందికి శ్వాసకోశ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. ఊపిరితిత్తుల్లో దుమ్ము, ధూళి పేరుకుపోతున్నాయి. కాలుష్య కారకాలు చేరుతున్నాయి. దీంతో ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. అయితే ఇలా జరగకుండా ఉండాలంటే మనం తీసుకునే ఆహారం ఎంతో ముఖ్య పాత్రను పోషిస్తుంది. మన ఆహారంలో బెల్లంను చేర్చుకుంటే శ్వాసకోశ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఊపిరితిత్తులు శుభ్రంగా మారుతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులతోపాటు గొంతులో ఉండే కఫం, కాలుష్య కారకాలు బయటకు వెళ్లిపోతాయి. కనుక కాలుష్య భరితమైన వాతావరణంలో నివసించే వారు బెల్లంను రోజూ తినాల్సి ఉంటుంది. ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయి..

బెల్లంను రోజూ తినడం వల్ల ఊపిరితిత్తులు శుభ్రంగా మారుతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన అనంతరం చిన్న బెల్లం ముక్కను తింటే చాలు ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన టాక్సిన్లు, వ్యర్థాలు బయటకు పోతాయి. బెల్లంలో మెగ్నిషియం, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని వాయు మార్గాల్లో పేరుకుపోయిన కాలుష్య కారకాలను బయటకు పంపించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. దీంతో ఊపిరితిత్తుల్లోని కాలుష్య కారకాలు బయటకు పోతాయి. ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయి. కాలుష్య భరితమైన వాతావరణంలో ఉండే వారు బెల్లంను తింటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఎప్పటికప్పుడు పేరుకుపోయే టాక్సిన్లను బయటకు పంపవచ్చు.

### కఫం మొత్తం కరుగుతుంది..

రాత్రి పూట భోజనం చేసిన అనంతరం చిన్న బెల్లం ముక్కను తిని గోరు వెచ్చని నీళ్లను ఒక గ్లాస్ తాగాలి. దీని వల్ల కఫం మొత్తం కరిగిపోతుంది. మన శరీరంలో రోజూ ముక్కు, వాయు మార్గాలు, గొంతు, ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోతుంది. ఫలితంగా బాక్టీరియా, వైరస్‌లు చేరుతాయి. దీంతో శ్వాసకోశ సమస్యలు వస్తాయి. అయితే బెల్లంను తిని గోరు వెచ్చని నీళ్లను తాగుతుంటే ఇలా పేరుకుపోయే కఫం మొత్తం కరుగుతుంది. దీంతో శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి. కనుక రోజూ బెల్లంను తింటే మంచిది. అలాగే బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో సెలీనియం ఉంటుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తుంది. దీంతో ఊపిరితిత్తుల కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో వాపులు తగ్గుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీని వల్ల ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి.

### రోగ నిరోధక శక్తికి..

కాలుష్యం మరీ ఎక్కువగా ఉన్నప్పుడు మన శరీర రోగ నిరోధక వ్యవస్థ సరిగ్గా పనిచేయదు. దీని కారణంగా మనకు అనేక శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉంటాయి. అయితే బెల్లంను తింటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగేందుకు అవసరం అయిన విటమిన్లు, మినరల్స్‌ను బెల్లం అందిస్తుంది. దీంతో రోగ నిరోధక శక్తి కణాలు ఉత్పత్తి అవుతాయి. ఫలితంగా శరీరం బ్యాక్టీరియా, వైరస్‌లపై పోరాటం చేస్తుంది. దీంతో బ్రాంకైటిస్, సైనస్ వంటి తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఇలా అనేక రకాలుగా బెల్లం ఉపయోగపడుతుంది. కనుక చలికాలంలో శ్వాసకోశ సమస్యలకు దూరంగా ఉండాలనుకునేవారు, వాటి నుంచి ఉపశమనం పొందాలని అనుకునేవారు రోజూ చిన్న బెల్లం ముక్కను తింటుండాలి. దీంతో అనేక విధాలుగా ప్రయోజనం ఉంటుంది.

# గబ్బా టెస్ట్‌లో బుమ్రా డబుల్ ఫీట్..



స్పోర్ట్స్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో మూడోరోజు భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా డబుల్ ఫీట్ సాధించాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా 76 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో టీమిండియా సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. పెర్త్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

మూడో టెస్ట్‌లో రెండోరోజు ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ జోడీ నాలుగో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. ఈ భాగస్వామ్యానికి బుమ్రా బ్రేక్ వేస్తూ.. ఇద్దరిని పెవిలియన్‌కు పంపాడు. కొత్త బంతితో తొలి సెషన్‌లో ఆస్ట్రేలియాను ఇబ్బందులకు గురి చేశాడు. ఉస్మాన్ ఖవాజా, నాథన్ మెక్‌స్వీనీలను అవుట్ చేసి షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత ట్రావిస్ హెడ్, స్మిత్ జోడీ నాలుగో వికెట్‌కు 242 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయగా.. ఇద్దరిని వరుసగా ఔవుట్ చేశాడు. స్మిత్‌ను రోహిత్ శర్మ క్యాచ్ పట్టగా.. వికెట్ కీపర్ రిషబ్ పంత్ చేతికి హెడ్ చిక్కాడు. అలాగే, మిచెల్ మార్ష్ ఇచ్చిన క్యాచ్ బుమ్రా ఒడిసిపట్టాడు.

ప్రసన్నను అధిగమించిన మిస్టరీ బౌలర్

మూడోరోజు సైతం బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మిచెల్ స్టార్క్.. బుమ్రా బౌలింగ్‌లో పంత్‌కి క్యాచ్ అవుట్ అయ్యాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు బుమ్రా అత్యధికంగా వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 18 వికెట్లు తీశాడు. మిస్టరీ బౌలర్ స్పెల్ బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో టీమిండియాబౌలర్ అత్యుత్తమ ప్రదర్శన ఇదే. ఇంతకు ముందు జనవరి, 1968లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు ఆరు వికెట్లు తీసిన ఎరపల్లి ప్రసన్నను అధిగమించాడు.

ఆస్ట్రేలియా గడ్డపై 50 వికెట్లు..

ఆస్ట్రేలియా పర్యటనలో జస్ప్రీత్ బుమ్రా 50 టెస్ట్ వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై బుమ్రా కంటే ఉమేశ్ యాదవ్ ఎక్కువ వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. ఉమేశ్ 17 మ్యాచ్‌ల్లో 53 వికెట్లు తీశాడు. బుమ్రా కేవలం 10 మ్యాచ్‌ల్లోనే 50 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. ఈ ఫాస్ట్ బౌలర్ సగటు 17.62 కాగా.. కపిల్‌దేవ్ రికార్డును సైతం అధిగమించే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో కపిల్ దేవ్ 51 వికెట్లు పడగొట్టాడు. ఈ మూడో టెస్ట్‌లోనే ఉమేశ్, కపిల్ దేవ్‌ను అధిగమించే ఛాన్స్ ఉన్నది.

# ముంబైదే ముస్తాక్ అలీ

స్పోర్ట్స్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):సయ్యద్



ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై 5 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. ఎంపీ నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. 47 పరుగులకే పృథ్వీషా(10), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(16) వికెట్లు కోల్పోయిన ముంబైని సీనియర్లు సూర్యకుమార్‌యాదవ్(48), రహానే(37) ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 52 పరుగులు జతచేశారు. అయితే 14.4 ఓవర్లలో ముంబై 129 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో సూర్యాంశ్ శెడ్గె(15 బంతుల్లో 36 నాటౌట్), అథర్వ(16 నాటౌట్) చెలరేగడంతో ముంబై గెలుపు వాకిట నిలిచింది. త్రిపురేశ్‌సింగ్(2/34) రెండు వికెట్లు తీశాడు. తొలుత కెప్టెన్ రజత్ పాటిదార్(40 బంతుల్లో 81 నాటౌట్, 6ఫోర్లు, 6సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో ఎంపీ 20 ఓవర్లలో 174/8 స్కోరు చేసింది. పాటిదార్ మినహా ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. శార్దుల్, రోస్టన్ రెండేసి వికెట్లు తీశారు. సూర్యాంశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', రహానే 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

## మళ్లీ అదే తప్పు చేసి దొరికిపోయిన కింగ్ కోహ్లీ



స్పోర్ట్స్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్ ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. పెర్త్‌లో సెంచరీ చేసిన అతను.. బ్రిస్బేన్‌లో జరుగుతున్న మూడవ టెస్టు మూడవ రోజు కేవలం 3 రన్స్‌కే ఔటయ్యాడు. కోహ్లీ తన ఆటతీరును మార్చుకోలేకపోతున్నట్లు స్పష్టం అవుతున్నది. ఆస్ట్రేలియా టూర్‌లో అతని బ్యాటింగ్ కష్టాలు కొనసాగుతున్నాయి. ఆఫ్ సైడ్ బంతిని డ్రైవ్ చేయబోయి.. మరోసారి అతను కీపర్‌కు చిక్కాడు. ఆస్ట్రేలియా పిచ్‌లపై ఇలా కోహ్లీ ఔట్ కావడం కామన్‌గా మారింది. ఆసీస్ పేస్ బౌలర్లు తమ లెన్త్, బౌన్స్‌తో కోహ్లీని కన్ఫ్యూజ్ చేస్తున్నారు. దీంతో అతను ఈజీగా తన వికెట్‌ను సమర్పించుకుంటున్నాడు. ఇవాళ కూడా ఆఫ్ స్టంప్‌కు దూరంగా వెళ్తున్న బంతిని ఆడబోయి కోహ్లీ ఔటయ్యాడు. జోష్ హేజిల్‌వుడ్ వేసిన వైడ్ డెలివరీని కొట్టబోయి దొరికిపోయాడు. కీపర్ అలెక్స్ క్యారీ ఈజీగా ఆ క్యాచ్ పట్టేశాడు. విరాట్ ఆడుతున్న తీరుపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఔట్‌సైడ్ ఆఫ్ స్టంప్ వెళ్తున్న బంతుల్ని ఎందుకు కోహ్లీ ఆడుతున్నాని ప్రశ్నించారు. కోహ్లీ కెరీర్ ఇటీవల ఒడిదిడుకులకు లోనైంది. ఈ మధ్య భారీ ఇన్నింగ్స్ ఆడిన సందర్భాలు కూడా తక్కువయ్యాయి. దూరంగా వెళ్తున్న బంతిని కొట్టబోయి.. కోహ్లీ ఔటైన విధానం అతనిలో ఉన్న ఆందోళనను స్పష్టం చేస్తున్నది. క్రీజ్‌లో ఎక్కువ సేపు గడపలేకపోతున్న కోహ్లీపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ నడుస్తోంది. ఇంటర్నెట్ యూజర్లు రకరకాల కామెంట్లతో చెలరేగిపోతున్నారు.

## చాంపియన్ ట్రోఫీతో స్వదేశంలో అడుగుపెట్టిన గుకేశ్



స్పోర్ట్స్ న్యూస్ ,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ప్రపంచ చెస్ చాంపియన్‌గా 18 ఏళ్ల గుకేశ్ అవతరించిన విషయం తెలిసిందే. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు. ఆ టైటిల్‌ను అందుకున్న అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో గుకేశ్ తాజాగా స్వదేశానికి చేరుకున్నారు. ఇవాళ ఉదయం తమిళనాడు రాజధాని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా గుకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. పాఠశాల విద్యార్థులు, అధికారులు గుకేశ్‌ను ఘనంగా స్వాగతించారు. భారత జెండాలు ప్రదర్శిస్తూ పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుకేశ్ మాట్లాడుతూ.. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



# సినిమా న్యూస్

# సీమ బ్యాక్‌డ్రాప్ లవ్‌స్టోరీతో అఖిల్ కొత్త సినిమా..



మూవీ న్యూస్,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):కెరీర్‌లో సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకరు అక్కినేని అఖిల్ . గతేడాది సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నటించిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇప్పటివరకు నటించిన బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయకపోవడంతో.. అఖిల్ నెక్స్ట్ ఏ సినిమా ప్రకటిస్తాడా.. ? అని ఎదురుచూస్తున్న వారి కోసం కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది.అఖిల్ కొత్త ప్రాజెక్ట్ రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లో సాగే ప్రేమ కథని తెలుస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు .దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ లాంచ్ కూడా పూర్తయినట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందించనున్నాడు. అంతేకాదు ఈ మూవీలో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల అఖిల్‌కు జోడీగా కనిపించబోతుందని.. హెూంబ్యానర్లపై నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా తెరకెక్కించనున్నారని ఇన్ సైడ్ టాక్. మురళీ కిశోర్ అబ్బూరు వినరో భాగ్యము విష్ణు కథ చిత్రాన్ని తెరకెక్కించాడు. మరి ఈ డైరెక్టర్ అఖిల్‌కు మంచి బ్రేక్ ఇస్తాడా..? అన్నది తెలియాల్సి ఉంది. అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీ తో నవంబర్ 26న ఘనంగా జరిగింది. వీరి వెడ్డింగ్ వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.



# సతీ లీలావతి

మూవీ న్యూస్,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో, తాతినేని సత్య దర్శకత్వంలో, నాగమోహన్‌బాబు.ఎం, రాజేష్.టి నిర్మిస్తున్న చిత్రానికి 'సతీ లీలావతి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఆదివారం లావణ్య త్రిపాఠి పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'సతీలీలావతిగా డిఫరెంట్‌రోల్‌లో లావణ్య కనిపించనున్నారు. ఉత్సుకతను కలిగించే కథాంశంతో ఈ సినిమా రూపొందనుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాట లు: ఉదయ్ పొట్టిపాడు, కెమెరా: బినేంద్ర మీనన్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మా ణం: దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్.

# సినిమా షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం.



మూవీ న్యూస్,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):అగ్ర కథానాయకుడు ప్రభాస్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా.. ఆయన గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని ప్రభాస్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమాను వచ్చే ఏడాది జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. జనవరి 3న జపాన్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా జపాన్‌లో ప్రమోషన్స్‌లో పాల్గొనాల్సి ఉంది ప్రభాస్. అయితే తాను ఈ వేడుకకు రాలేకపోతున్నానని ప్రభాస్ వెల్లడించారు. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు, అభిమానాలకు ధన్యవాదాలు. జపాన్‌లోని అభిమానులని కలవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. కానీ మూవీ షూటింగ్‌లో నా కాలుకు గాయమైంది. దీంతో ఈ జపాన్‌కు రాలేకపోతున్న.. ఈ విషయంలో నన్ను క్షమించండి అంటూ ప్రభాస్ రాసుకోచ్చాడు.

# కిరాటగా మోహన్ లాల్.. 'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

మూవీ న్యూస్,16 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు.హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మళయాలం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో లాలెట్టన్ (మోహన్ లాల్) కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.




Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com